జన కేతనం
▸ భీమిలి... విభిన్న శైలి!
▸ అక్కడ నిర్బంధ ఓటింగ్
▸ 'పేట'లో ఒకసారి ఓడితే..అంతే!
- 7లో

బస్సుల కోసం పడిగాపులు

వైసీపీ సేవలో ఆర్టీసీ

- సీఎం జగన్ 'మేమంతా సిద్ధం' సభకు అనకాపల్లి డిపో నుంచి 65, నర్సీపట్నం నుంచి 75 బస్సులు తరలింపు
- మండుటెండలో ప్రయాణికులకు తప్పని అగచాట్లు
- మరో గత్యంతరం లేక ఆటోలను ఆశ్రయించిన వైనం
- అధికారుల తీరుపై జనం ఆగ్రహం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 20:

జిల్లాలో సీఎం సభ జరుగుతుందంటే చాలు ఆర్టీసీ ప్రయాణికులు హడలెత్తిపోతున్నారు. అనకాపల్లి, నర్సీపట్నం డిపోల నుంచి అధిక సంఖ్యలో ఆర్టీసీ బస్సులను సీఎం సభకు తరలిస్తుండడంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. అనకాపల్లి డిపోలో వంద బస్సులు ఉండగా శనివారం కశింకోట మండలం గొబ్బూరులో జరిగే సీఎం సిద్ధం సభకు 65 బస్సులను తరలించారు. నర్సీపట్నం డిపోలో 94 బస్సులు ఉంటే వాటిలో 75 బస్సులను సీఎం సభకు కేటాయించారు. దీంతో విశాఖ, అల్లూరి సీతారామరాజు జిల్లా, విజయనగరం జిల్లాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు సైతం ఇబ్బందులు పడ్డారు. గంటల తరబడి వేచి ఉండాల్సి రావడంతో అవస్థలు పడ్డారు.

కశింకోట మండలం గొబ్బూరులో శనివారం జరిగే సీఎం సభకు అనకాపల్లి డిపో నుంచి 65 బస్సులను కేటాయించారు. ఉదయం ఏడు గంటలకే ప్రజలను గొబ్బూరులో జరిగే సభకు తరలించేందుకు పంపించారు. దీంతో అనకాపల్లి పట్టణం నుంచి విశాఖ, విజయనగరం, నర్సీపట్నం, పాయకరావుపేట, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పలు ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అనకాపల్లి డిపో నుంచి చోడవరం, ఘాట్‌రోడ్డు, పాడేరు మీదుగా జోలాపుట్‌కు వెళ్లాల్సిన బస్సును సైతం డిపో అధికారులు సీఎం సభకు పంపించారు. శ్రీకాకుళం జిల్లా పలాస, సరిహద్దులోని పర్లాకిమిడి సర్వీసును రద్దు చేశారు. విశాఖ, విజయనగరం, పాయకరావుపేట, నర్సీపట్నం, చోడవరం, దేవరాపల్లి, రావికమతం, తట్టబంధ తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో కోత విధించడంతో ప్రయాణికులకు కాంప్లెక్స్‌లో నిరీక్షణ తప్పలేదు. ఒక పక్క ఎండ తీవ్రత, మరో వైపు ఉక్కపోతతో అల్లాడిపోయారు. కేవలం 35 బస్సులను మాత్రమే ఇటు విజయనగరం, విశాఖ, అటు పాయకరావుపేట, నర్సీపట్నం, చోడవరం మీదుగా అధికారులు నడిపారు. బస్సులు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి స్వగ్రామాలకు చేరాల్సిన పరిస్థితి నెలకొంది. దీనిపై పీటీడీ డీపీటీవో పద్మావతిని వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాము బస్సులను పంపించామన్నారు.


అనకాపల్లి కాంప్లెక్స్‌లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు


నర్సీపట్నం బస్టాండ్‌లో బస్సులు లేక ఖాళీగా ఉన్న ప్లాట్‌ఫారాలు

నర్సీపట్నంలో 75 బస్సులు తరలింపు

నర్సీపట్నం: సీఎం సభకు నర్సీపట్నం డిపో లోని 94 బస్సులకు గాను 75 బస్సులను తరలించారు. మిగిలిన 19 బస్సులను రూటుకొకటి చొప్పున సర్దుబాటు చేశారు. నర్సీపట్నం డిపో నుంచి విశాఖపట్నం, అనకాపల్లి, చోడవరం, తుని, చింతపల్లి, పాడేరు, కృష్ణాదేవిపేట, కొయ్యూరు, జీకేవీధి తదితర ప్రాంతాలకు రోజూ 25 వేల మందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారు. తుని, విశాఖపట్నం రూటుల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. మిగిలిన రోజులకంటే శనివారం ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. శనివారం సీఎం సభకు బస్సులను తరలించడంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడ్డారు. బస్టాండ్‌లో గంటల

... మిగతా 8వ పేజీలో

పిల్లలతో ఇబ్బంది పడ్డాం



మాది దేవరాపల్లి. కూర్మన్నపాలేనికి పని మీద వెళ్లి స్వగ్రామానికి వెళ్లేందుకు అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వచ్చాను. ఉదయం పదకొండున్నర గంటలకు కాంప్లెక్స్‌కు వచ్చినా ఒక్క బస్సు కూడా రాలేదు. పిల్లలతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. మధ్యాహ్నం 1.30 గంటలకు బస్సు ఉందని పీటీడీ సిబ్బంది చెప్పారు గానీ బస్సు రాలేదు. అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా ప్రయాణికులను ఇబ్బంది పెట్టడం సరికాదు.

-జి. గుప్తా, దేవరాపల్లి, ప్రయాణికుడు

గంటల తరబడి పడిగాపులు కాశాం



మాది వాడచీపురుపల్లి గ్రామం. చౌడువాడ వెళ్లేందుకు స్వగ్రామం నుంచి అనకాపల్లి కాంప్లెక్స్‌కు ఉదయం 11 గంటలకు వచ్చాం. మధ్యాహ్నం ఒంటిగంటన్నర అయినా చౌడువాడ వెళ్లేందుకు ఒక్క బస్సు కూడా రాలేదు. బస్సులు లేకపోవడం వల్ల చాలా ఇబ్బంది పడ్డాం. బస్సులు అందుబాటులో లేనప్పుడు ప్రయాణికులకు తెలిసే విధంగా అధికారులు ప్రకటన చేసి ఉంటే ప్రయాణం మానుకోవడం లేదా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునేవాళ్లం. ఒక పక్క ఎండ, మరో వైపు ఉక్కపోతతో కాంప్లెక్స్‌లో బస్సుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- డి.ధనలక్ష్మి, వాడచీపురుపల్లి, ప్రయాణికురాలు

జిల్లా ఊసేది?

చింతలపాలెం మేమంతా సిద్ధం సభలో చప్పగా సాగిన సీఎం జగన్ ప్రసంగం


మాట్లాడుతున్న సీఎం జగన్

- సుజల స్రవంతి పూర్తి చేస్తామని, షుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తామని చెబుతారని ఆశగా ఎదురుచూసిన జనం
- కేవలం ప్రతిపక్షాలపై విమర్శలు, తనను గెలిపించకపోతే భవిష్యత్తు అంధకారమేనంటూ బెదిరింపులకే పరిమితం

అనకాపల్లి (కశింకోట), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి):

స్థానిక సమస్యల ప్రస్తావన లేదు. మూతపడిన షుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తామని భరోసా ఇవ్వలేదు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకాన్ని పూర్తి చేస్తామని మాట వరసకైనా చెప్పలేదు. ప్రతిపక్షాలపై విమర్శలు, తనను మళ్లీ గెలిపించకపోతే భవిష్యత్తు అంధకారమంటూ ప్రజలను బెదిరించడం తప్ప కొత్తగా చెప్పిందేమీ లేదు.. ఇదీ కశింకోట మండలం నర్సింగబిల్లికి సమీపంలోని చింతలపాలెంలో శనివారం నిర్వహించిన మేమంతా సిద్ధం సభలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రసంగం తీరు.

జిల్లాలో దీర్ఘకాలంగా పరిష్కారం కాని సమస్యలు ఎన్నో ఉన్నాయి. వీటిని సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రస్తావించి పరిష్కారానికి హామీ ఇస్తారని అందరూ ఎదురుచూశారు. అయితే ఇక్కడ జరిగిన మేమంతా సిద్ధం సభలో జిల్లాలోని ఒక్క సమస్యను కూడా జగన్ ప్రస్తావించలేదు. కేవలం ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం, మళ్లీ తనకు ఓట్లు వేసి గెలిపించకపోతే భవిష్యత్తు అంధకారం అవుతుందని ప్రజలను భయాందోళనకు గురిచేశారు. జిల్లాలో ప్రధానంగా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం పనులు పడకేశాయి. వైసీపీ ప్రభుత్వం నిధుల విడుదలలో జాప్యం వల్ల పనులు ముందుకు సాగలేదు. అదే విధంగా వైసీపీ పాలనలో జిల్లాలో తుమ్మపాల, తాండవ, ఏటికొప్పాక సహకార రంగ షుగర్ ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. వాటిని తెరిపించి రైతులు, కార్మికులను ఆదుకోవాలని ప్రజలు ఎప్పటి నుంచో కోరుతున్నారు. సీఎం కనీసం ఈ విషయాన్ని ప్రస్తావించలేదు. అర్ధాంతరంగా నిలిచిపోయిన పోలవరం ఎడమ కాలువ పనులతో పాటు పెద్దేరు, తాండవ, రైవాడ రిజర్వాయర్ల ఆధునికీకరణ ఊసే లేదు. రాష్ట్ర వ్యాప్తంగా

... మిగతా 8వ పేజీలో


ఎస్.రాయవరం మండలం వమ్మవరం వద్ద జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

జగన్ బస్సు యాత్రతో ట్రాఫిక్ కష్టాలు

గోకులపాడు నుంచి ధర్మవరం అగ్రహారం వరకు జాతీయ రహదారిపై నిలిచిన వాహనాలు

- సుమారు గంట సేపు వాహనచోదకుల పడిగాపులు
- తుని- అనకాపల్లి వైపు యాత్ర సాగుతుంటే తుని వైపు వెళ్లే వాహనాలను నిలిపివేయడంపై పలువురి అసహనం


అచ్యుతాపురంలో నిలిచిపోయిన వాహనాలు

ఎస్.రాయవరం, ఏప్రిల్ 20: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేపట్టిన బస్సు యాత్ర వల్ల ప్రజలకు అవస్థలు తప్పలేదు. శనివారం ఉదయం 11 గంటలకు మండలంలోని అడ్డరోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా జగన్ బస్సు యాత్ర సాగింది. అయితే నక్కపల్లి నుంచి బయలుదేరిన బస్సు యాత్ర ఇంకా అడ్డరోడ్డు కూడా చేరకముందే విశాఖ నుంచి తుని వైపు వెళ్లే మార్గంలో గోకులపాడు వద్ద జాతీయ రహదారిపై వాహనాలను నిలిపివేయడంతో, ధర్మవరం అగ్రహారం వరకు జాతీయ రహదారిపై సుమారు రెండు కిలో మీటర్ల మేర సుమారు గంట పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. దాంతో వాహనాల్లో ప్రయాణించే వారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తుని నుంచి అనకాపల్లి వైపు బస్సు యాత్ర సాగుతుంటే, తుని వైపు వెళ్లే వాహనాలను నిలిపివేయడం ఏమిటంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. బస్సు యాత్రలో భాగంగా అడ్డరోడ్డు చేరుకున్న సీఎం జగన్ ఫ్లైఓవర్ బ్రిడ్జిపై అక్కడకు చేరుకున్న వైసీపీ శ్రేణులకు, నాయకులకు బస్సులో నుంచి అభివాదం చేశారు. అనంతరం ధర్మవరం అగ్రహారం వద్ద అప్పటికే వేచి ఉన్న పలువురు మహిళలు చూసి జగన్ బస్సును ఆపి వారిని పలకరించారు.


అచ్యుతాపురంలో..

అచ్యుతాపురం: జగన్ బస్సు యాత్ర సందర్భంగా ఎలమంచిలి నుంచి ట్రాఫిక్‌ను అచ్యుతాపురం, పరవాడ, లంకెలపాలెం మీదుగా మళ్లించారు. శనివారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో అచ్యుతాపురం జంక్షన్‌లో ట్రాఫిక్ నిలిచిపోయింది. కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. అచ్యుతాపురం జంక్షన్‌లో ఎటు చూసినా మూడు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఓ వైపు ఎండ వేడి, మరో వైపు ట్రాఫిక్ స్తంభించడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. రాత్రి ఏడు గంటలైనా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కాలేదు.

హామీలకే పరిమితం

పరిష్కారం కాని ప్రధాన సమస్యలు

- కార్యరూపం దాల్చని సబ్బవరం- నర్సీపట్నం హైవే
- అసంపూర్తిగానే బీఎన్ రోడ్డు
- ఎడ్యుకేషనల్ హబ్, సెజ్‌ల ఏర్పాటులో కదలిక శూన్యం
- ప్రభుత్వ విప్ ధర్మశ్రీ పాలన తీరు ఇది


గోవాడ షుగర్ ఫ్యాక్టరీ (ఇన్‌సెట్‌లో) కరణం ధర్మశ్రీ

చోడవరం, ఏప్రిల్ 20:

నియోజకవర్గంలో ప్రధాన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ విప్ ధర్మశ్రీ ఇచ్చిన హామీల్లో అధిక శాతం ప్రకటనలకే పరిమితమయ్యాయి. నియోజకవర్గంలో ప్రధానంగా గోవాడ షుగర్ ఫ్యాక్టరీని అప్పుల ఊబి నుంచి గట్టెక్కించి రూ.వంద కోట్లతో ఫ్యాక్టరీలో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితమైంది.

ఇథనాల్ ప్రాజెక్టు ఏర్పాటుకు వైసీపీ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను తిరిగి వెనక్కి తీసుకోవడం తప్పితే, ఇథనాల్ ప్రాజెక్టు ఏర్పాటులో కదలిక లేకుండా పోయింది. ఐదేళ్ల క్రితం వరకు 5 లక్షల టన్నుల చెరకు క్రషింగ్ చేసే గోవాడ షుగర్స్, ఇప్పుడు 2 లక్షల టన్నులు కూడా ఆడలేని దుస్థితికి దిగజారిపోయింది. ఈ ఏడాది సీజన్ పూర్తికావచ్చినా, పూర్తిస్థాయిలో రైతులకు, కార్మికులకు పేమెంట్లు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. ఇక నియోజకవర్గం మీదుగా సబ్బవరం నుంచి నర్సీపట్నం హైవే రోడ్డు నిర్మాణం చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. ఈ హైవే నిర్మాణంపై జిల్లాలోని అనకాపల్లి ఎంపీ సత్యవతి, నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్‌తో కలిసి కేంద్రమంత్రికి వినతి పత్రం ఇచ్చారు. అయితే హైవే నిర్మాణంలో ఎలాంటి కదలిక లేకపోగా, కనీసం రూ.113 కోట్లతో ఐదేళ్ల క్రితం చేపట్టిన బీఎన్ రోడ్డు విస్తరణ పనులు ఇప్పటికీ పూర్తి చేయలేక, ఐదేళ్లుగా ప్రజలను గుంతల రోడ్డుపై కష్టాలపాలు చేశారు. నియోజకవర్గ పరిధిలో వెంకన్నపాలెం, బుచ్చెయ్యపేట మండలం కోమళ్లపూడి సమీపంలో సెజ్‌లు నెలకొల్పి పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పిస్తామని గట్టిగా హామీ ఇచ్చారు. దీనిపై ఏపీఐఐసీ అధికారులు గతంలో ఓసారి వచ్చి ఈ ప్రాంతాన్ని పరిశీలించి వెళ్లడం తప్పితే పరిశ్రమల ఏర్పాటు కార్యరూపం దాల్చకపోవడం గమనార్హం. ఇక వైద్యపరంగా మండలంలోని వెంకన్నపాలెంలో పీహెచ్‌సీ ఏర్పాటు కూడా ప్రకటనలకే పరిమితమైంది. మండలానికి రెండో పీహెచ్‌సీ కూడా అమలుకు నోచుకోలేదు. ఇక చోడవరం మేజర్ పంచాయతీని మునిసిపాలిటీగా అభివృద్ధి చేయడంతో పాటు, సీఎస్ఆర్ పథకం కింద నిధులు తెచ్చి పట్టణంలో చేపట్టే డబుల్ రోడ్డు, సుందరీకరణ ప్రాజెక్టులు కూడా అటకెక్కిపోయాయి. మౌలిక సదుపాయాలు కల్పించలేని దయనీయస్థితిలో పంచాయతీ ఉంది. సుందరీకరణతో పాటు, పట్టణంలోని పాత చెరువును ట్యాంక్ బండ్ స్థాయిలో అభివృద్ధి చేస్తామన్న హామీ కూడా గాలిలో కలిసిపోయింది. పట్టణంలోని రహదారుల అభివృద్ధి, ఇతర సమస్యలు కూడా ఎక్కడవి అక్కడ అలానే ఉండిపోయాయి. చోడవరంలో ఇంటింటికీ కొళాయి పథకం పనులు ఇప్పటికీ పూర్తిస్థాయిలో చేయకపోవడంతో కొన్ని ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. నియోజకవర్గంలో ఎడ్యుకేషనల్ హబ్ ప్రకటన కూడా హామీగానే మిగిలిపోయింది. కోమళ్లపూడి వద్ద కేంద్రీయ విద్యాలయం హామీ పక్కకు పోయింది. పట్టణంలో ప్రజలు అత్యధికంగా కష్టాలు ఎదుర్కొంటున్నది విద్యుత్ సమస్య. రూరల్, చోడవరం టౌన్‌కు ఒకే ఒక్క 33కేవీ సబ్‌స్టేషన్‌తో ప్రజలు నిత్యం విద్యుత్ అవాంతరాలతో ఇబ్బందులు పడుతున్నా, నరసయ్యపేటలో ఐదేళ్ల నుంచి 33కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు


చోడవరం- సబ్బవరం రోడ్డు

... మిగతా 8వ పేజీలో


రిటర్నింగ్ అధికారి చిన్నికృష్ణకు నామినేషన్ సమర్పిస్తున్న చోడవరం టీడీపీ అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజు

కొనసాగుతున్న నామినేషన్ల పర్వం

- అనకాపల్లి ఎంపీ స్థానానికి ఒకటి, అసెంబ్లీ సెగ్మెంట్లకు ఐదుగురు..
- చోడవరం టీడీపీ అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజు నామినేషన్ దాఖలు

అనకాపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి):

అనకాపల్లి జిల్లాలో శనివారం అనకాపల్లి పార్లమెంటు స్థానానికి ఒకరు, జిల్లాలోని అసెంబ్లీ స్థానాలకు ఐదుగురు నామినేషన్‌లు దాఖలు చేశారు. పార్లమెంటు స్థానానికి జైభారత్ పార్టీ తరపున ఆడారి శరశ్చంద్ర నామినేషన్ దాఖలు చేశారు. ఇక చోడవరం అసెంబ్లీ నియోజకవర్గానికి టీడీపీ అభ్యర్థిగా సూర్యనాగ సన్యాసి రాజు (కేఎస్ఎన్ఎస్ రాజు) నామినేషన్ వేశారు. అదేవిధంగా మాడుగుల అసెంబ్లీ స్థానానికి నవభారత్ నిర్మాణ సేవా పార్టీ తరఫున తాళ్ల రవి, అనకాపల్లి అసెంబ్లీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా ఆళ్ల సత్తిరాజు, ఎలమంచిలి అసెంబ్లీ స్థానానికి పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి బొర్రా అమ్మాజమ్మ, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తరపున సుందరపు ఈశ్వరరావు నామినేషన్ దాఖలు చేశారు. పాయకరావుపేట, నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గాల్లో శనివారం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు.

ఇంకా బోణీ కాలేదు

నక్కపల్లి: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేసి మూడు రోజులు గడిచినా ఇంకా పాయకరావుపేట నియోజకవర్గంలో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. గురు, శుక్రవారం, శనివారం ఈ మూడు రోజులు పాయకరావుపేట అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి బోణీ లేకపోవడం విశేషం. సోమవారం వైసీపీ అభ్యర్థి కంబాల జోగులు, టీడీపీ అభ్యర్థిని వంగలపూడి అనిత నామినేషన్లు దాఖలు చేయనున్నారు.

సీఎం రమేశ్ గెలుపుతో అనకాపల్లి అభివృద్ధి

- సమర్థులను గెలిపిస్తే ప్రగతి పథంలో రాష్ట్రం
- మాజీ కేంద్ర మంత్రి, మెగాస్టార్ కొణిదెల చిరంజీవి

అనకాపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి):

కేంద్ర ప్రభుత్వంలో అనేక మంది పెద్దలతో మంచి సంబంధాలున్న సీఎం రమేశ్ లాంటి సమర్థత గల నాయకుల గెలుపుతో అనకాపల్లితో పాటు రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు పెడుతుందని మాజీ కేంద్ర మంత్రి, మెగాస్టార్ చిరంజీవి అన్నారు. హైదరాబాద్‌లోని చిరంజీవి నివాసంలో ఆయనను సీఎం రమేశ్, పెందుర్తి జనసేన అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ రాజకీయాల గురించి

... మిగతా 8వ పేజీలో


హైదరాబాద్‌లో చిరంజీవి నివాసంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం రమేశ్, పక్కన పంచకర్ల రమేశ్‌బాబు

విశాఖపై జగన్మోహన్‌రెడ్డి కపట ప్రేమ

- ఐదేళ్లలో నగరానికి చేసిందేమీ లేదు
- అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకు అనేక శంకుస్థాపనలు
- ఇప్పటికీ పూర్తికాని ప్రాజెక్టులు
- కొన్ని పనులే మొదలుకాలేదు
- ఐటీ రంగంపైనా చిన్నచూపు
- రాజధాని పేరుచెప్పి నాలుగేళ్లుగా మిలీనియం టవర్లు ఖాళీ
- మరోవైపు రాయితీలు అందక మూతపడిన కంపెనీలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నంపై ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కపట ప్రేమ కనబరుస్తున్నారు. 'అది చేస్తా...ఇది చేస్తా' అని చెప్పడమే తప్ప ఈ ఐదేళ్లలో చేసిందేమీ లేదు. ముఖ్యంగా ఐటీ హబ్‌గా పేరొందిన విశాఖలో రూ.250 కోట్లతో నిర్మించిన మిలీనియం టవర్లను నాలుగేళ్లుగా ఖాళీగా ఉంచి... ఇక్కడి యువతకు ఉపాధి లేకుండా చేశారు. విశాఖలో పరిపాలనా రాజధాని పెడతామంటూ...ఆ భవనాలను ఖాళీగా ఉంచేశారు. ఐటీ కంపెనీలకు రాయితీలు మంజూరు చేయకపోవడంతో కొత్త కంపెనీలు ఏపీ విశాఖపట్నం రాలేదు. ఇన్ఫోసిస్ కంపెనీ తన అవసరాల కోసం ఇక్కడ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుచేస్తే అది తమ ఖాతాలో వేసుకొని డప్పాలు కొడుతున్నారు. ఒక్కటంటే ఒక్క ఐటీ కంపెనీ కొత్తది రాలేదు. తెలుగుదేశం ప్రభుత్వంలో చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేసిన అదానీ డేటా సెంటర్‌కే జగన్మోహన్‌రెడ్డి మళ్లీ శంకుస్థాపన చేశారు. ఇది జరిగి ఏడాదైనా పునాదిరాయి తప్ప ఇంకేమీ లేదు.

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆరు నెలలకు విశాఖపట్నంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సుమారు రూ.1,300 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అవన్నీ ఏడాదిలో పూర్తికావాలని అధికారులను ఆదేశించారు. వాటిలో సగం ప్రాజెక్టుల పనులు పది శాతం పనులు కూడా చేపట్టలేదు. వాటిపై ఆయన ఏనాడూ సమీక్షించిన పాపాన పోలేదు. పరిస్థితి ఇలా ఉంటే...ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం ఇక్కడి అభివృద్ధి పనుల సమీక్ష కోసం క్యాంపు కార్యాలయం అంటూ రుషికొండకు బోడిగుండు కొట్టి రెండేళ్ల వ్యవధిలో రూ.450 కోట్లతో అత్యాధునిక వసతులతో తన కోసం అందమైన భవనం నిర్మించుకున్నారు.



నాలుగున్నరేళ్ల క్రితం (డిసెంబరు, 2019) ప్రజల అవసరాల కోసం చేపట్టిన పనులు పూర్తి చేయించడంలో శ్రద్ధ చూపని ఆయన...కోర్టులో అడ్డంకులున్నా సరే ఖాతరు చేయకుండా తన కోసం రుషికొండపై క్యాంపు కార్యాలయాన్ని మాత్రం పూర్తిచేయించుకున్నారు. ఇవన్నీ చూసి విశాఖ ప్రజలకు ఆయనపై విశ్వాసం పోయింది. ఏమి చేశారని మళ్లీ 'మేమంతా సిద్ధం' అంటూ వస్తున్నారని ప్రశ్నిస్తున్నారు.

సీఎం పట్టించుకోని ప్రాజెక్టులు ఇవే..

- కాపులుప్పాడలోని 15 ఎకరాల్లో నేచురల్ హిస్టరీ పార్క్, మ్యూజియం అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు శంకుస్థాపన చేశారు. దీని అంచనా వ్యయం రూ.88 కోట్లు. కేంద్రం రూ.38 కోట్లు ఇవ్వగా, వీఎంఆర్‌డీఏ ద్వారా రూ.50 కోట్లు పెట్టాల్సి ఉంది. దీనికి ఇప్పటివరకూ ఢిల్లీకి డీపీఆర్ పంపలేదు. దీనిపై ఏనాడూ సీఎం సమీక్షించలేదు.
- ఉమ్మడి విశాఖ జిల్లాలో పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ఏరియా అచ్యుతాపురం. అక్కడ ఏపీ సెజ్‌తో పాటు బ్రాండిక్స్, ఏసియన్ పెయింట్స్ వంటి పరిశ్రమలు ఉన్నాయి. వాటిలో పనిచేసే వేలాది మంది కార్మికులు ఎలమంచిలి, గాజువాక, అనకాపల్లి, పరవాడ ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. అక్కడ ప్రజా రవాణా వ్యవస్థకు ఇబ్బంది లేకుండా గాజువాక దగ్గర రఘురామ్ లేఅవుట్ నుంచి ఏపీ సెజ్ వరకు 4.38 కి.మీ. పొడవైన రహదారిని 100 అడుగుల వెడల్పుతో నిర్మించడానికి, అచ్యుతాపురం జంక్షన్‌ను అందంగా, విశాలంగా తీర్చిదిద్దే ప్రాజెక్టుకు రూ.27.13 కోట్లతో శంకుస్థాపన చేశారు. పాత రహదారి పూర్తిగా పాడైపోయినా సరే కొత్త రహదారి నిర్మాణానికి ఇంకా పనులు ప్రారంభించలేదు.
- సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ ఉద్యోగ భవన్ ముందున్న ఖాళీ స్థలంలో రూ.80 కోట్లతో మల్టీ లెవెల్ పార్కింగ్ భవనం నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేశారు. అందులో 510 కార్లు, 792 బైకులు పార్కు చేసుకునేలా ప్లాన్ చేశారు. ఆ పైన మరో ఐదు ఫ్లోర్లు వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తామని చెప్పారు. ఈ పనులు ఇంకా నత్తనడకన సాగుతున్నాయి. వీఎంఆర్‌డీఏ కార్యాలయం ముందున్న ప్రాజెక్టే ఇలా సాగుతున్నదంటే...మిగిలినవి ఎలా ఉంటాయో చెప్పాల్సిన అవసరం లేదు.
- ఆర్కే బీచ్‌లో రూ.10 కోట్ల అంచనా వ్యయంతో సీ హ్యారియర్ ప్రాజెక్టుతో పాటు మరో రూ.30 కోట్లతో ఆర్టిఫిషియల్ నేవీ మ్యూజియం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కింద మీద పడి సీ హ్యారియర్ మ్యూజియం పూర్తి చేశారే తప్ప నేవీ మ్యూజియం పూర్తిగా పక్కన పెట్టేశారు.
- రాష్ట్రంలో ప్లానిటోరియం ఎక్కడా లేదు. అందుకని కైలాసగిరిపై ఏడు ఎకరాల విస్తీర్ణంలో ఒక అందమైన అద్భుత ప్లానిటోరియం నిర్మాణానికి సీఎం 2019లోనే శంకుస్థాపన చేశారు. దీనికి రూ.34 కోట్లు వ్యయం అవుతుందని అంచనా. ఈ ప్రాజెక్టు ఊసే లేదు.

వైసీపీ నుంచి 35 కుటుంబాలు టీడీపీ గూటికి



వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారితో అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, ఏప్రిల్ 20 : పట్టణంలోని పెదబొడ్డేపల్లిలో గల యాతపేటలో వైసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరారు. శనివారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మాజీ మంత్రి, టీడీపీ అభ్యర్థి అయ్యన్నపాత్రుడు సమక్షంలో పెంకే సత్తిబాబు, బండ రాజు, పెంకె రంగబాబు, ప్రసాద్‌లతో పాటు 35 కుటుంబాలు టీడీపీలోకి చేరారు. వీరికి అయ్యన్న కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం గడచిన ఐదేళ్లుగా యువతను మాయమాటలతో మభ్యపెట్టి వారి బంగారు భవిష్యత్తును నాశనం చేసిందని విమర్శించారు. ప్రజలంతా ఈ ఎన్నికల్లో ఓటు ద్వారా జగన్‌కు బుద్ధిచెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాలయ విజయ్, పలువురు టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజు ఆస్తుల విలువ రూ.32.64 కోట్లు

- ఆయన పేరుపై రూ.17.87 కోట్లు
- భార్య పేరుపై 14.77 కోట్లు
- అఫిడవిట్‌లో పేర్కొన్న చోడవరం మాజీ ఎమ్మెల్యే

చోడవరం, ఏప్రిల్ 20 : చోడవరం నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా శనివారం నామినేషన్ దాఖలు చేసిన మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు సమర్పించిన అఫిడవిట్‌లో తన భార్యపేరిట ఉన్న స్థిర, చరాస్తుల విలువ రూ.32.64 కోట్లుగా చూపించారు. కేఎస్ఎన్ఎస్ రాజు పేరిట ఉన్న స్థిరాస్థుల విలువ రూ.17.7 కోట్లు, చరాస్తుల విలువ రూ.17.80లక్షలు, ఆయన భార్య పేరుతో ఉన్న స్థిరాస్థుల విలువ రూ.13.65 కోట్లుగా, చరాస్తులు విలువ రూ.కోటి 12లక్షలుగా పేర్కొన్నారు. భార్య పేరిట 48తులాల బంగారం, అతని పేరిట తొమ్మిది తులాల బంగారం ఉంది. భార్య పేరిట ఉన్న నగదు రూ.15లక్షలు, రాజుపేరుతో రూ.10లక్షల నగదు చూపించారు. భార్య పేరిట ఫార్చునర్ వెహికల్‌తో పాటు, రెండు మహీంద్రా బొలేరో వాహనాలు ఉన్నాయి. అలాగే అతని పేరిట బుచ్చెయ్యపేట మండలం పోలేపల్లి వద్ద నాలుగు ఎకరాల 65 సెంట్లు, మండలంలోని చాకిపల్లి సమీపంలోని తగరంపూడి వద్ద 18 ఎకరాల 48 సెంట్లు భూమితో పాటు, పట్టణంలోని 760 గజాల వాణిజ్య స్థలం ఉన్నట్టుగా పేర్కొన్నారు ఇక ఆయన భార్యపేరుతో విజయనగరం జిల్లా గుర్ల వద్ద 21 ఎకరాల 13సెంట్లు వ్యవసాయభూమి, పట్టణంలోని 731 గజాల వాణిజ్యస్థలం చూపించారు. రాజు పేరు మీద కనకమహాలక్ష్మి బ్యాంకులో రూ.2.50 రుణం, యాక్సిస్ బ్యాంకులో కోటి 23లక్షలు తనఖా రుణం, బంగారంపై కనకమహాలక్ష్మి బ్యాంకులో 2లక్షల 16వేలు ఉన్నట్టుగా చూపించారు. భార్య పేరుతో ఉన్న వాహనాలపై రూ.35లక్షలు ఫైనాన్స్ ఉన్నట్టుగా చూపించారు. ఇదిలావుంటే, మాజీ ఎమ్మెల్యే రాజుపై ఇటీవల టైల్స్ ఫ్యాక్టరీ వద్ద జరిగిన వివాదానికి సంబంధించిన కేసు ఒక్కటే ఉంది. టైల్స్ ఫ్యాక్టరీ మీద జీఎస్టీ అధికారుల దాడుల సందర్భంగా అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌తో పాటు, మాజీ ఎమ్మెల్యే రాజు అధికారులను నిలదీసిన సందర్భంగా, అధికారులు ఇచ్చిన ఫిర్యాదుపై దాఖలైన కేసును అఫిడవిట్‌లో చూపించారు.

'నార్త్' వైసీపీ అభ్యర్థి కేకే రాజుపై కేసు నమోదు

సీతంపేట, ఏప్రిల్ 20: నామినేషన్ దాఖలు సమయంలో నిబంధనలను అతిక్రమించిన విశాఖ ఉత్తర నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి కేకే రాజుపై ఎన్నికల రిటర్నింగ్ అధికారి అఖిల శనివారం ద్వారకానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం నామినేషన్ దాఖలు సమయంలో సీతమ్మధార తహసీల్దారు కార్యాలయానికి 100 మీటర్ల దూరంలో ఊరేగింపు నిలిపివేయాలని ఆయన్ను పోలీసులు హెచ్చరించారని, అయితే వాటిని బేఖాతరు చేస్తూ వందల మంది కార్యాలయ ఆవరణలోకి వచ్చారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదుచేశారు.

29 మంది వలంటీర్ల రాజీనామా

చోడవరం/రోలుగుంట, ఏప్రిల్ 20 : గ్రామ వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. చోడవరం మండలం గాంధీగ్రామం పంచాయతీకి చెందిన 20మంది వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. సదరు పత్రాలను ఎండీవో కార్యాలయంలో అందజేశారు. అలాగే, రోలుగుంట మండలం కొమరవోలు సచివాలయ పరిధిలో ఉన్న పన్నెండు మంది వలంటీర్లలో తొమ్మిది మంది తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శికి అందజేశారు.

వినియోగదారుల సమస్యలు పరిష్కారమే లక్ష్యం

- సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ



వినియోగదారుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకుటుంన్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ

లంకెలపాలెం, ఏప్రిల్ 20: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కస్టమర్ గ్రీవెన్స్ రెసిడెన్షియల్ ఫోరం (సీజీఆర్ఎఫ్) కృషి చేస్తోందని సీజీఆర్ఎఫ్ చైర్మన్ బి. సత్యనారాయణ అన్నారు. ఏపీఈపీడీసీఎల్ లంకెలపాలెం సెక్షన్ కార్యాలయం పరిధిలోని పెదముషిడివాడ సబ్ స్టేషన్ వద్ద శనివారం ఏర్పాటు చేసిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. వినియోగదారులు ఎటువంటి విద్యుత్ సమస్య తలెత్తినా సెక్షన్ కార్యాలయం పరిధిలోని అధికారులకు దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సమస్యలపై సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే తక్షణమే టోల్‌ఫ్రీ నంబరు 1912ను సంప్రదించాలన్నారు. సమస్యల పరిష్కారంలో కాలయాపన చేస్తే వినియోగదారుల నేరుగా సీజీఆర్ఎఫ్ దృష్టికి తీసుకొస్తే సత్వరమే న్యాయం జరుగుతుందన్నారు. గత ఏడాది ఈ వేదికను ప్రారంభించామని, ఇప్పటికే శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఉమ్మడి జిల్లాల్లో 270 ఫిర్యాదులు పరిష్కరించినట్టు చెప్పారు. ఏపీఈపీడీసీఎల్ అధికారులు సాయిబాబా, శివసత్యనారాయణలు మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పలు విద్యుత్ సమస్యలను వినియోగదారులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ సభ్యులు శ్రీనివాస్, జనార్దన్, సురేంద్రకుమార్, డీపీఈ సురేశ్, ఏఈ వినోద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

- ఎమ్మెల్యే అభ్యర్థిని వంగలపూడి అనిత
- రాట్నాలపాలెంలో టీడీపీలో చేరిన దళిత నాయకులు



రాట్నాలపాలెంలో వైసీపీని వీడి టీడీపీలోకి చేరుతున్న దళిత నాయకులు

కోటవురట్ల, ఏప్రిల్ 20: రాష్ట్ర భవిష్యత్తు కోసం పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని పాయకరావుపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత అన్నారు. శనివారం కోటవురట్ల శివారు రాట్నాలపాలెం దళిత కాలనీలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు దళిత నాయకులు గంటేడ పరసయ్య బైసా దారలు, అయినేలు చంటి, షైలపల్లి జీవన్, సతీష్ వైసీపీని వీడి టీడీపీలో అనిత సమక్షంలో చేరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో దళితులతోపాటు అన్నివర్గాల ప్రజలు ఇబ్బంది పడ్డారన్నారు. పేదలకు సంక్షేమ పథకాలతోపాటు ఉపాధి అవసరమని జగన్ గుర్తించలేదన్నారు. దీంతో దళితులు ఆర్థిక ఎదుగుదల ఆగిపోయిందన్నారు. అబద్ధాలను ప్రచారం చేయడంలో జగన్‌కు ఎవరూ సాటిరారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి లాలం కాశీనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు, హరి, కోటి, గంటేడ లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న కల్యాణోత్సవాలలో నేటి కార్యక్రమాలు

సింహాచలం, ఏప్రిల్ 20: వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరుకల్యాణ మహోత్సవాలలో భాగంగా ఈనెల 21 ఆదివారం వేకువజామున నాలుగు గంటలకు సుప్రభాత సేవ, ప్రభాత ఆరాధన, విశేష హోమాలు, ఉదయం 7.30 నుంచి వైదిక సదస్యం, మంగళాశాసనము, ఉదయం 8 నుంచి 11.30గంటల వరకు భక్తులకు సర్వదర్శనాలు, 11.30 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు మహా రాజభోగము ఈ సమయంలో భక్తులకు దర్శనాలు లభించవు, మధ్యాహ్నం 3.30 గంటలకు వేదపండిత సదస్యం, సాయంత్రం ఆరుకు సర్వజన మనోరంజని వాహనంపై తిరువీధి, రాత్రి ఏడుకు ఆరాధన, విశేష హోమాలు ఉంటాయి.

కనకమహాలక్ష్మికి తులసీ దళార్చన సేవలు



జగదాంబ కూడలి, ఏప్రిల్ 20: వన్‌టౌన్ బురుజుపేటలోని కనకమహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి సహస్ర తులసీ దళార్చన సేవలను శనివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఉభయదాతలతో అర్చకులు ప్రత్యేక పూజలు చేయించారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

కాలువ ఇలా.. సాగుకు నీరెలా..?

తాండవ రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువల్లో రెండేళ్లుగా పూడిక తీయని వైసీపీ సర్కారు

- భారీగా పేరుకుపోయిన చెత్తాచెదారం
- ఆయకట్టు పరిధిలోని శివారు భూములకు అందని నీరు
- పంటలు సరిగా పండడం లేదని అన్నదాతలు ఆవేదన



తాండవ ఎడమ కాలువలో పేరుకుపొయిన పూడిక

నాతవరం, ఏప్రిల్ 20 : తాండవ రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువల్లో పూడికతీత పనులు ఎప్పుడు ప్రారంభిస్తారని ఆయకట్టు రైతులు ప్రశ్నిస్తున్నారు. 52వేల ఎకరాలకు సాగునీరు అందించే మండలంలోని తాండవ రిజర్వాయర్ కాలువల్లో రెండేళ్ల నుంచి పూడిక తీత పనులు చేపట్టలేదని వాపోతున్నారు.

ప్రతి ఏడాది ఖరీఫ్ పంటకు నీరు విడుదల చేసేముందు కాలువల్లో పూడికతీత చేపట్టేవారని, దీంతో రిజర్వాయర్ ఆయకట్టు చివరి భూములకు కూడా నీరు అందేదని చెపుతున్నారు. అయితే రెండేళ్ల నుంచి ఆ పరిస్థితి లేకపోవడంతో కాలువల్లో పూడిక పెరిగిపోవడంతో పాటు పిచ్చి మొక్కలు పెరిగిపోయాయని వాపోతున్నారు. ఫలితంగా నీరు విడిచిపెట్టే సమయాల్లో పొలాలకు వేగంగా నీరు ప్రవహించడం లేదని అంటున్నారు. అలాగే వరిపంట పొట్ట దశకు వచ్చినప్పుడు చివరి భూమలకు సరిగా నీరు అందడం లేదని ఆయా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత మార్చి నెలలో అధికారులు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి తాండవ కుడి, ఎడమ కాలువల్లో పూడికతీత పనులు చేపడతామని చెప్పినా, ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి వచ్చే ఖరీఫ్ వరకు వేచి చూడకుండా వెంటనే తాండవ కుడి, ఎడమ కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని ఆయకట్టు రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

క్రైం... crime news

రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడి మృతి

ఎస్.రాయవరం, ఏప్రిల్ 20: రేగుపాలెం-నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్ల మధ్య సోముదేవుపల్లి గ్రామ సమీపంలో రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడు(65) మృతి చెందినట్టు తుని రైల్వే ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ శనివారం తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. సోముదేవుపల్లి సమీపంలో తుని వైపు నుంచి విశాఖ వైపు వెళుతున్న రైలు ఓ వృద్ధుడిని ఢీకొనడంతో మృతి చెందాడు. వృద్ధుడు ఎవరన్నది తెలియరాలేదు. మృతదేహానికి కొద్ది దూరంలో ఎరుపు, నలుపు రంగు గల చిరిగిపోయిన టీ షర్టు పడివుంది తప్ప మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు దొరకలేదని ఎస్ఐ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. అలాగే అక్కడి కిలో మీటరు దూరంలో ఓ సైకిల్ మాత్రం ఉన్నాదన్నారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. మృతదేహాన్ని తుని గవర్నమెంట్ ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్టు చెప్పారు. మృతి వివరాలు తెలిసిన వారు 9494887786, 9490619020 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్ఐ మారూఫ్ కోరారు.

నాలుగు అంతస్థుల భవనంపై నుంచి పడి యువకుడి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం
- శ్లాబ్‌కు కాంక్రీట్ కోసం లిఫ్ట్ ఏర్పాటు చేస్తుండగా ప్రమాదం



ప్రమాదంలో మృతి చెందిన వెంకటరావు (ఫైల్‌ఫొటో)



గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పైడిరాజు

లంకెలపాలెం, ఏప్రిల్ 20: నాలుగో అంతస్థు శ్లాబ్ కాంక్రీట్ వేసేందుకు లిఫ్ట్ ఏర్పాటు చేస్తుండగా అది కూప్పకూలిపోవడంతో ఒకరు మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. జీవీఎంసీ 79వ వార్డు పరిధి లంకెలపాలెం శివారు గొల్లపేట ఇండస్ట్రియల్ ఏరియాలో శనివారం ఈప్రమాదం చోటుచేసుకొంది. ఇందుకు సంబంధించి పరవాడ పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. గొల్లపేట ఇండస్ట్రియల్ ఏరియా నాలుగో అంతస్థు శ్లాబ్ కాంక్రీట్ వేసేందుకు చీడికాడ మండలం వరహాపురం గ్రామానికి చెందిన కూలీలు ఒప్పందం చేసుకున్నారు. ఈ క్రమంలో ఆదివారం శ్లాబ్ వేసేందుకు శనివారం లిఫ్ట్ ఏర్పాటు చేస్తున్నారు. తాటికొండ వెంకటరావు (25) పోతుబంతి పైడిరాజు (30) నాలుగో అంతస్థు లిఫ్ట్‌పైన ఉండగా అద్దిపల్లి మహేశ్, కోమార మహేశ్ కింద ఉన్నారు. ఈక్రమంలో లిఫ్ట్ ఒక్కసారిగా కూలిపోయింది. ఈ ప్రమాదంలో వెంకటరావు, పైడిరాజు తీవ్రంగా గాయపడ్డారు. తోటి కూలీలు స్థానికుల సాయంతో క్షతగాత్రులను తొలుత అగనంపూడి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కేజీహెచ్‌కు తీసుకెళుతుండగా వెంకటరావు మార్గం మధ్యలో ప్రాణాలు విడిచారు. పైడిరాజు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇతని పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. వెంకటరావు అవివాహితుడు. తల్లి వెంకటలక్ష్మి, తండ్రి నాయుడు ఉన్నారు. పైడిరాజుకు భార్య దేవి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పరవాడ ఎస్ఐ మల్లేశ్వరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పది టేకు, గన్నర దుంగలు స్వాధీనం

- అక్రమ నిల్వలు ఉన్నట్టు ఉత్తరాంధ్ర స్క్వాడ్ డీఎఫ్‌వోకు సమాచారం
- పాత కృష్ణాదేవిపేటలో సిబ్బందితో కలిసి తనిఖీలు



స్క్వాడ్ బృందం గుర్తించిన టేకు, గన్నర దుంగలు (అంతర్ చిత్రం) మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర స్క్వాడ్ డీఎఫ్‌వో

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 20: గొలుగొండ మండలం పాత కృష్ణాదేవిపేటలో గల పలువురు కార్పెంటర్ల ఇళ్ల వద్ద ఉత్తరాంధ్ర స్క్వాడ్ డీఎఫ్‌వో సోమసుందరం బృందం శనివారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. నల్లగొండ, కొప్పుగొండ అటవీ ప్లాంటేషన్‌లో టేకు చెట్లను నరికి పాత కృష్ణాదేవిపేట కార్పెంటర్ల పనిచేస్తున్నట్టు అందిన ఫిర్యాదు మేరకు ఈ తనిఖీలు చేపట్టారు. ఓ కార్పెంటర్ ఇంటి సమీపంలో పది టేకు, గన్నర దుంగలను పట్టుకున్నారు. అయితే ఇళ్ల నిర్మాణం నిమిత్తం పొలంలో టేకు చెట్లు నరికి తెచ్చుకున్నట్టు సదరు వ్యక్తి సమాధానం ఇచ్చారు. అనుమతులు లేకుండా టేకు చెట్టు నరికి తెచ్చుకోవడం కూడా నేరమని అధికారులు ఆయనతో అన్నారు. కలప దుంగలను స్వాధీనం చేసుకుని, సదరు వ్యక్తిపై కేసు నమోదు చేస్తున్నామన్నారు. అనంతరం అంతాడ, గొలుగొండ ప్రాంతాల్లో పర్యటించారు. గొలుగొండ కలప డిపోలో నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్క్వాడ్ డీఎఫ్‌వో సోమసుందరం విలేకరులతో మాట్లాడుతూ టేకు, గన్నర, నల్లమద్ది తదితర జాతులకు చెందిన అటవీ సంపదను అక్రమంగా తరలించినా, అనుమతులు లేకుండా ఫర్నీచర్ తయారు చేసినా ప్రజలు తమకు ఫిర్యాదులు చేయాల్సిందిగా కోరారు. ప్రస్తుతం వేసవి కావడంతో అడవుల్లో అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అదే జరిగితే మంటలను అదుపు చేసేందుకు ప్రజలు సహకరించాల్సిందిగా కోరారు. ఆయన వెంట కృష్ణాదేవిపేట రేంజ్ ఆఫీసర్ సుంకర వెంకటరావు, స్క్వాడ్ రేంజర్లు గంగరాజు, జగదీష్, భార్గవవర్మ, సెక్షన్ అధికారి సుబ్బారావు తదితరులు ఉన్నారు.

దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 20: వేసవి రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రయాణికుల సౌకర్యార్థం దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు.

బెంగళూరు-మల్దా టౌన్-బెంగళూరు

06563 నంబరు గల రైలు మే 12 నుంచి జూన్ రెండు వరకు ప్రతి ఆదివారం రాత్రి 11.40 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరులో బయలుదేరి మర్నాడు సాయంత్రం 6.30 గంటలకు దువ్వాడ, మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు మల్దా టౌన్ చేరుతుంది. తిరిగి మే 15 నుంచి జూన్ ఐదు వరకు ప్రతి బుధవారం సాయంత్రం 4.00 గంటలకు మల్దా టౌన్‌లో బయలుదేరి మర్నాడు మధ్యాహ్నం 3.08 గంటలకు దువ్వాడ, శుక్రవారం ఉదయం 9.30 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరు చేరుతుంది.

మైసూరు- ముజాఫర్‌పూర్- మైసూరు

06221 నంబరు గల రైలు మే 13 నుంచి జూన్ మూడు వరకు ప్రతి సోమవారం ఉదయం 10.30 గంటలకు మైసూరులో బయలుదేరి మర్నాడు ఉదయం 7.18 గంటలకు దువ్వాడ, బుధవారం మధ్యాహ్నం 1.30 గంటలకు ముజాఫర్‌పూర్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో మే 16 నుంచి జూన్ ఆరు వరకు ప్రతి గురువారం మధ్యాహ్నం 1.00 గంటలకు ముజాఫర్‌పూర్‌లో బయలుదేరి మర్నాడు రాత్రి 7.18 గంటలకు దువ్వాడ, శనివారం సాయంత్రం 4.40 గంటలకు మైసూరు చేరుతుంది.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	411
విజయనగరం	415
శ్రీకాకుళం	415

అక్కడ... నిర్బంధ ఓటింగ్

ప్రపంచంలోని 30 దేశాల్లో అమలు

- ఎట్టి పరిస్థితుల్లో ఓటు వేయాల్సిందే
- వేయకుంటే కొన్నిచోట్ల ఓటరు జాబితా నుంచి పేరు తొలగిస్తారు
- మరికొన్నిచోట్ల జరిమానా
- కొన్ని దేశాలు ప్రభుత్వ పథకాల్లో కోత
- పాస్‌పోర్టు, లైసెన్స్ రద్దు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నిర్బంధ విద్య...ఈ మాట అందరికీ తెలిసిందే. కానీ కొన్ని దేశాల్లో నిర్బంధ ఓటింగ్ విధానం ఉందని మీకు తెలుసా? ఆశ్చర్యపోతున్నారా. ప్రపంచంలోని 30 దేశాల్లో ఓటు తప్పనిసరిగా వేయాలి. లేదంటే జాబితా నుంచి పేరు తొలగిస్తారు, జరిమానా విధిస్తారు. పథకాల్లో కోత విధిస్తారు. ఇటువంటి మాటలు మనకు ఆశ్చర్యం కలిగించినా వాస్తవం. మన దేశంలో 60 శాతం పోలింగ్ జరిగితే అదేదో గొప్పలా చెప్పుకుంటాం. 75 శాతం జరిగితే మిరాకిల్‌గా అంటాం. అటువంటప్పుడు వంద శాతం ఓటింగ్ జరిగే దేశాలున్నాయంటే ఆశ్చర్యమే కదా. ఓటు హక్కు వినియోగాన్ని తప్పనిసరి చేయాలని మన దేశంలోనూ ఎప్పటి నుంచో డిమాండ్ ఉంది. గ్రామీణ జనాభా, నిరక్షరాస్యులున్న భారత్ వంటి దేశాల్లో ఇది సాధ్యం కాకపోవచ్చు. అందుకే ఎన్నికల సంఘం గరిష్ఠ స్థాయిలో ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రచారం నిర్వహిస్తోంది. కొన్ని దేశాల్లో ఓటింగ్ విధానం పరిశీలిద్దాం.

30కి పైగా దేశాల్లో ఓటు తప్పనిసరి

ప్రపంచవ్యాప్తంగా 30కి పైగా దేశాల్లో ఓటు హక్కు వినియోగం తప్పనిసరి. ఓటు వేయకుంటే కొన్ని దేశాల్లో జరిమానాలు విధిస్తే, మరికొన్ని దేశాల్లో ప్రభుత్వ పథకాలకు అనర్హులుగా భావిస్తారు. ఇంకొన్ని దేశాల్లో ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యం తగ్గిస్తారు. కొన్ని దేశాల్లో ఓటు హక్కు తొలగించే విధానం కూడా అమల్లో ఉంది. ప్రజాస్వామ్య దేశాల్లో ఓటు హక్కు వినియోగం రాజ్యాంగ హక్కు. భారత్‌లాంటి దేశాల్లో ఓటు హక్కు వినియోగించుకోవడం బాధ్యతగా ప్రతి పౌరుడు భావించాలని ప్రచారం చేస్తుంటారు. తప్పనిసరిగా ఓటు వేయాలని చెప్పే దేశాల్లో ఆస్ట్రేలియా, సింగపూర్, ఫిలిప్పీన్స్, ఆస్ట్రియా, అర్జెంటీనా, బెల్జియం, బొలీవియా, ఈజిప్ట్, ఉక్రెయిన్, గ్రీస్, మెక్సికో, ఇటలీ, స్విట్జర్లాండ్, థాయ్‌లాండ్, టర్కీ వంటి దేశాలు ఉన్నాయి.

అమెరికాలో ఆంక్షలు లేవు

అమెరికాలాంటి అగ్రరాజ్యంలో ఓటు వేసేందుకు ఎటువంటి ఆంక్షలు ఉండవు. అందుకే అక్కడ 60-65 శాతం మేరకు పోలింగ్ జరుగుతూ ఉంటుంది. పోలింగ్ రోజున ఉదయం 7 నుంచి రాత్రి 8 గంటల వరకు తమ ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. పోలింగ్ రోజున సెలవు కూడా ఇవ్వరు. ఉద్యోగులు తమకు వీలైన సమయంలో ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంటుంది.



ఓటుతో గుర్తింపు

బొలీవియాలో ఓటు వేసిన వారికి గుర్తింపు కార్డు జారీచేస్తారు. అది ఉన్నవారికే ప్రభుత్వ సౌకర్యాలు కల్పిస్తారు. విద్యుత్, రేషన్, తాగునీరు వంటి సౌకర్యాలకు ఆధార్ కార్డులా అక్కడవారికి ఓటరు గుర్తింపు కార్డు తప్పనిసరి. ప్రభుత్వ ఉద్యోగులు ఓటు వేయకుంటే వేతనం నిలిపి విచారణ చేపడతారు.



సింగపూర్‌లో పేరు తొలగింపు

సింపూర్‌లో ఓటు వేయకుంటే పేర్లు గుర్తించి జాబితా నుంచి తొలగిస్తారు. తగిన ఆధారాలతో ఎందుకు ఓటు వేయలేక పోయారో వివరణ ఇస్తే, ఆ వివరణతో సంతృప్తి చెందితే ఓటు పునరుద్ధరిస్తారు.



ఇటలీలో శతశాతం

ఇటలీ దేశంలో ఓటు వేయడం పౌరుల విధిగా రాజ్యాంగంలో పొందుపరిచారు. గతంలో ఓటు వేయని వారి పేర్లు అక్కడ పోలింగ్ కేంద్రాల వద్ద పెడతారు. పోలీసులు జారీచేసే అన్ని సర్టిఫికెట్లలో ఈ వివరాలు ఉంటాయి. దీంతో అక్కడి ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోవడంలో ముందువరుసలో ఉంటారు.

అత్యధిక పోలింగ్ జరిగే దేశాలు

ప్రపంచంలో అత్యధికంగా ఆస్ట్రేలియా, ఇటలీ, లక్సెంబర్గ్, చిలీ, బెల్జియం దేశాలు పోలింగ్‌లో ముందుంటాయి. ఆయా దేశాల్లో 90 శాతానికిపైగే ఓటింగ్ జరుగుతుంది. నెదర్లాండ్స్, జర్మనీ, న్యూజిలాండ్, ఐలాండ్, స్వీడన్, ఆస్ట్రియా వంటి దేశాల్లో 80 శాతానికిపైగా పోలింగ్ జరుగుతుంది.

నాలుగుసార్లు ఓటు వేయకుంటే...

బెల్జియంలో ఓటరు జాబితాలో పేరుండి వరుసగా నాలుగుసార్లు ఓటు హక్కు వినియోగించుకోని పక్షంలో ఆ తర్వాత పదేళ్ల పాటు అతనికి ఓటు హక్కు నిషేధిస్తారు. ఓటు హక్కు వినియోగించుకోని వారు జరిమానా కూడా చెల్లించాల్సి ఉంటుంది. మొదటిసారి రెండు వేల యూరోలు, రెండోసారి వేయకుంటే పది వేల యూరోల వరకు జరిమానా విధిస్తారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో, పథకాల్లో ప్రాధాన్యం తగ్గుతుంది. ఇండియన్ కరెన్సీ ప్రకారం దాని విలువ రూ.3 లక్షలపైనే. అలాగే ఆస్ట్రేలియా దేశంలో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలి. దాన్ని వినియోగించుకోవాలి. లేకుంటే వారం రోజుల తర్వాత విచారణ జరిపి అపరాధ రుసుము ఎంత చెల్లించాలో ప్రకటిస్తారు.

పాస్‌పోర్టు, లైసెన్సు రద్దు

గ్రీస్ దేశంలో ఓటు వేయకుంటే డ్రైవింగ్ లైసెన్సు, పాస్ పోర్టు రద్దు చేస్తారు. ఓటు హక్కు వినియోగించుకోని వారు పాస్ పోర్టుకు దరఖాస్తు చేసుకుంటే తిరస్కరిస్తారు. ఓటు ఎందుకు వేయలేక పోయారో సహేతుకమైన కారణం చూపాల్సి ఉంటుంది.

అర్జెంటీనా: 18 నుంచి 70 ఏళ్ల మధ్య వయసు ఉన్నవారంతా తప్పనిసరిగా ఓటు వేయాలి. ఆపై వయసు వారికి ఓటు హక్కు వినియోగం తప్పనిసరి కాదు. ఈ వయసు వారు ఓటు వేయడం లేదన్న విషయాన్ని 48 గంటలకు ముందే సమాచారం ఇవ్వాలి. బ్రెజిల్‌లోనూ ఇదే విధానం అమల్లో ఉంది.

ఫ్రాన్స్: పౌరుల దినోత్సవం సందర్భంగా రక్షణ శాఖ నిర్బంధంగా ప్రజల వివరాలు సేకరిస్తుంది. వాటిని జాతీయ ఆర్థిక గణాంక సంస్థ విశ్లేషిస్తుంది. 18 ఏళ్లు దాటిన వారికి ఓటరుగా గుర్తింపు కార్డు ఇస్తుంది. పెరూ దేశంలోనూ 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పిస్తారు. ఆస్పత్రుల్లో ఉన్నా ఓటు హక్కు వినియోగించుకోవాల్సిందే. లేకుంటే రూ.5 వేల వరకు జరిమానా విధిస్తారు.

నియోజకవర్గంలో	
మొత్తం ఓటర్లు	3,58,511
పురుషులు	1,75,870
స్త్రీలు	1,82,626
ఇతరులు	15

రాష్ట్రంలోనే అత్యధిక ఓటర్లున్న నియోజకవర్గం



భీమునిపట్నం వ్యూ

- 14 ఎన్నికల్లో ఆరుసార్లు టీడీపీకే జైకొట్టిన జనం
- నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆర్ఎస్‌డీపీ అప్పలనరసింహరాజు
- ప్రస్తుతం రెండోసారి తలపడుతున్న గంటా శ్రీనివాసరావు
- మూడోసారి పోటీలో ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమిలి... విభిన్న శైలి!

చారిత్రక ప్రాధాన్యమున్న భీమునిపట్నం నియోజకవర్గం విభిన్న శైలిని సంతరించుకుంది. రాష్ట్రంలోనే అత్యధిక ఓటర్లున్న నియోజకవర్గంగా గుర్తింపును సాధించింది. 1952 నుంచి జరిగిన 14 ఎన్నికల్లో ఏకంగా ఆరుసార్లు తెలుగుదేశం పార్టీని ఆదరించింది. ఐదుసార్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఇక్కడి నుంచి విజయం సాధించగా తొలి ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి సత్తా చాటారు. ప్రజా సోషలిస్టు పార్టీ, వైసీపీ ఒకసారి భీమిలి నుంచి గెలుపొందాయి.

స్వాతంత్ర్యానంతరం 1951 డీ లిమిటేషన్ ఆర్డర్స్ మేరకు భీమునిపట్నం శాసనసభ నియోజకవర్గం ఏర్పడింది. 1952లో మొదటిసారి ఎన్నికలు నిర్వహించే సమయానికి 66,642 ఓటర్లు ఉండేవారు. ప్రస్తుతం రాష్ట్రంలోనే అత్యధికంగా 3,58,511 ఓటర్లున్నారు. 1952లో జరిగిన ఎన్నికల్లో భీమిలి పురపాలక సంఘం మాజీ ఛైర్మన్ కలిగొట్ల సూర్యనారాయణ నాయుడు స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించారు. అప్పట్లో విశాఖ, విజయనగరం జిల్లాల సరిహద్దులో విస్తరించిన ఈ నియోజకవర్గం, తర్వాత జరిగిన పునర్విభజనతో విశాఖ జిల్లాకే పరిమితమయింది. భీమిలి అర్బన్, మండలం ఆనందపురం, పద్మనాభం మండలాలతో పాటు విశాఖ రూరల్ మండలంలోని కొన్ని గ్రామాలు చేరాయి. ఇప్పటివరకూ భీమిలిలో 14 సార్లు ఎన్నికలు జరగ్గా, ఒకసారి స్వతంత్ర అభ్యర్థి, ప్రజా సోషలిస్టు పార్టీ ఒకసారి, కాంగ్రెస్ ఐదు సార్లు, తెలుగుదేశం ఆరు సార్లు, ప్రజా రాజ్యం, వైసీపీ ఒకసారి విజయం సాధించాయి.

సత్తా చాటిన కలిగొట్ల

మొట్టమొదట 1952లో జరిగిన ఎన్నికల్లో భీమిలికి చెందిన మునిసిపల్ మాజీ ఛైర్మన్ కలిగొట్ల సూర్యనారాయణనాయుడు స్వతంత్ర అభ్యర్థిగా, ప్రజా సోషలిస్ట్ పార్టీ అభ్యర్థిగా బొత్స ఆదినారాయణ, భారత జాతీయ కాంగ్రెస్ అభ్యర్థిగా పూసపాటి మాధవవర్మ, చిట్టివలసకు చెందిన కార్మిక సంఘం నాయకుడు జేవీకే వల్లభరావు స్వతంత్రులుగా తలపడ్డారు. వీరిలో కలిగొట్లకు అత్యధికంగా 11,194 ఓట్లు, వల్లభరావుకు 10,200 ఓట్లు, బొత్సకు 8,156 ఓట్లు, మాధవ వర్మకు 5,769 ఓట్లు లభించాయి. 994 ఓట్ల మెజారిటీతో కలిగొట్ల గెలుపొందారు. తర్వాత 1956లో అలమండకు చెందిన గొట్టిముక్కల జగన్నాథరాజు (ప్రజా సోషలిస్టు పార్టీ), 1960 ఉపఎన్నిక, 1962, 1967 ఎన్నికల్లో విజయనగరం సంస్థానాధీశులు డా.రాజాసాహెబ్ పూసపాటి విజయరామ గజపతిరాజు (భారత జాతీయ కాంగ్రెస్), 1972 ఎన్నికల్లో పాంద్రంగికి చెందిన రాజాసాగి సోమ సుందర సూర్యనారాయణ రాజు (ప్రభు) కాంగ్రెస్(ఆర్), 1978 ఎన్నికల్లో మజ్జివలసకు చెందిన దాట్ల జగన్నాథరాజు(కాంగ్రెస్ ఐ) ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. 1983లో జరిగిన ఎన్నికల్లో పూసపాటి ఆనందగజపతిరాజు (తెలుగుదేశం), సిట్టింగ్ ఎమ్మెల్యే దాట్ల జగన్నాథరాజు(ఐఎన్‌సి) పోటీ చేశారు. వీరిలో ఆనందగజపతిరాజుకు 55,239 ఓట్లు, జగన్నాథరాజుకు 15,663 ఓట్లు లభించాయి. మొత్తం ఓట్లు 1,00,372 పోలవగా 70,902 ఓట్లు మాత్రమే చెల్లుబాటయ్యాయి. ఆనందగజపతిరాజు 39,576 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

2004లో మారిన పంథా

టీడీపీ కంచుకోటగా గుర్తింపు సాధించిన భీమిలి నియోజకవర్గ ప్రజలు తొలిసారి 2004లో విభిన్నమైన తీర్పును ఇచ్చారు. ఆ ఎన్నికల్లోనూ టీడీపీ అప్పలనరసింహరాజునే అభ్యర్థిగా రంగంలోకి దింపింది. కాంగ్రెస్ అభ్యర్థిగా అడవివరం సర్పంచ్ కర్రి సీతారామును కాంగ్రెస్ పోటీలో నిలిపింది. మైలపల్లి నల్లయ్య (బీఎస్పీ), స్వతంత్ర అభ్యర్థులుగా సిరిపురపు సన్యాసినాయుడు, కర్రి వల్లభనారాయణ, పైడిరాజు కర్రి నిలిచారు. ఈ ఎన్నికల్లో కర్రి సీతారాముకు 57,619 ఓట్లు, అప్పలనరసింహరాజుకు 57,318 ఓట్లు లభించగా, సీతారాము 241 ఓట్ల స్వల్ప ఆధిక్యతతో గెలుపొందారు. 2009లో మెగాస్టార్ చిరంజీవి రాజకీయ అరంగేట్రంతో ఆనందపురం ఎంపీపీ కోరాడ రాజబాబు ప్రజారాజ్యం పార్టీ టికెట్ ఆశించారు. అయితే ముత్తంశెట్టి శ్రీనివాసరావును ఆ పార్టీ రంగంలోకి దింపింది. ప్రజారాజ్యం నుంచి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, టీడీపీ నుంచి నడింపల్లి ఆంజనేయరాజు, కాంగ్రెస్ నుంచి పీలా ఉమారాణి, స్వతంత్ర అభ్యర్థిగా కోరాడ రాజబాబు బరిలో నిలిచారు. ఆ ఎన్నికల్లో మొత్తం ఓట్లు 2,23,147కాగా, 1,76,771 పోలయ్యాయి. ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు 52,130 ఓట్లు, ఆంజనేయరాజుకు 45,820, ఉమారాణికి 41,219, రాజబాబుకు 22,953 ఓట్లు లభించాయి. ముత్తంశెట్టి 6,310 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. 2014 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా గంటా శ్రీనివాసరావు, వైసీపీ నుంచి మాజీ ఎమ్మెల్యే కర్రి సీతారాము, కాంగ్రెస్ నుంచి చెన్నా దాసు, సకురు అనిత ఇండిపెండెంట్‌గా రంగంలో నిలిచారు. ఈ ఎన్నికల్లో మొత్తం ఓట్లు 2,11,132 కాగా, గంటా శ్రీనివాసరావుకు 1,18,020 ఓట్లు లభించాయి. సీతారాముకు 80,794 ఓట్లు వచ్చాయి. 37,226 ఓట్లు భారీ ఆధిక్యతతో గంటా గెలుపొందారు. 2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు, టీడీపీ నుంచి విశాఖ మాజీ మేయరు సబ్బం హరి, జనసేన అభ్యర్థిగా పంచకర్ల నాగ సందీప్, బీజేపీ అభ్యర్థిగా మాజీ కార్పొరేటర్ కోరాడ అప్పారావు, కాంగ్రెస్ అభ్యర్థిగా తెడ్డు రామదాసు, జనజాగృతి అభ్యర్థిగా డి.ప్రభాగౌడ్, శివసేన అభ్యర్థిగా గండికోట రాజేష్, పిరమిడ్ పార్టీ తరపున కె.అచ్చింనాయుడు, కూన బాబూరావు, బక్కన్నపాలేనికి చెందిన బంక వెంకట అప్పారావులు స్వతంత్ర అభ్యర్థులుగా రంగంలో నిలిచారు. ఈ ఎన్నికలో 3,05,958 ఓటర్లుండగా, ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు అత్యధికంగా 1,01,629, సబ్బంహరికి 91,917 ఓట్లు లభించాయి. జనసేన అభ్యర్థి సందీప్‌కు 24,248 ఓట్లు లభించాయి. ముత్తంశెట్టి 9,712 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు.


● భీమునిపట్నం



కలిగొట్ల సూర్యనారాయణ నాయుడు



పీవీజీ రాజు



రాజా సాగి సోమ సుందర సూర్యనారాయణ రాజు



దాట్ల జగన్నాథరాజు



పూసపాటి ఆనందగజపతిరాజు



కర్రి సీతారామ్



గంటా శ్రీనివాసరావు



ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆర్ఎస్‌డీపీ నాలుగు సార్లు విజయభేరి

పాంద్రంగి గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే రాజా సాగి సోమసుందర సూర్యనారాయణరాజు సోదరుడు రాజాసాగి దేవీ ప్రసన్న అప్పలనరసింహరాజు (తెలుగుదేశం) 1985లో జరిగిన ఎన్నికల్లో రంగంలో దిగారు. ఆకెళ్ల శేషగిరిరావు (ఐఎన్‌సి) అభ్యర్థిగా, మరో ముగ్గురు స్వతంత్రులుగా పోటీ చేశారు. మొత్తం 1,10,828 ఓట్లు పోలవగా, 67,241 ఓట్లు చెల్లుబాటయ్యాయి. తెలుగుదేశం అభ్యర్థి ఆర్ఎస్‌డీపీ అప్పలనరసింహరాజుకు 49,552 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి ఆకెళ్ల శేషగిరిరావుకు 15,406 ఓట్లు లభించాయి. అప్పలనరసింహరాజు 34,146 ఓట్ల ఆధిక్యతతో గెలిచారు. 1989 ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే ఆర్ఎస్‌డీపీ అప్పలనరసింహరాజు (టీడీపీ) బరిలో నిలిచారు. కాంగ్రెస్ నుంచి జామి మండలానికి చెందిన వీరవెంకట సూర్యనారాయణరాజు, విశాఖకు చెందిన ఆళ్వార్‌దాస్ సుంకరి ఇద్దరూ బీఫారాలు తెచ్చుకోవడంతో ఎన్నికల అధికారులు ఇద్దరినీ ఇండిపెండెంట్ అభ్యర్థులుగా ప్రకటించారు. ఈ ఎన్నికల్లో అప్పలనరసింహరాజుకు 58,808 ఓట్లు, కాకర్లపూడికి 26,594 ఓట్లు, ఆళ్వార్‌దాస్‌కు 3,718 ఓట్లు లభించాయి. అప్పలనరసింహరాజు 32,214 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. 1994 ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే ఆర్ఎస్‌డీపీ తెలుగుదేశం అభ్యర్థిగా పోటీలో నిలిచారు. కాంగ్రెస్ అభ్యర్థిగా వేములవలసకు చెందిన కోరాడ శంకరరావు, బీజేపీ నుంచి కంచుబోయిన రామారావు, పి.రుద్రశేఖర్ (బీఎస్పీ), స్వతంత్ర అభ్యర్థులుగా గొల్లకోట విష్ణుమూర్తి, పూసపాటి మాధవవర్మ, కాకర్లపూడి వెంకట నరసింహరాజులు పోటీ పడ్డారు. వీరిలో అప్పలనరసింహరాజుకు అత్యధికంగా 64,726 ఓట్లు, శంకరరావుకు 27,877 ఓట్లు, రామారావుకు 5,916 ఓట్లు లభించాయి. దీంతో ఆర్ఎస్‌డీపీ 36,849 ఓట్ల ఆధిక్యతతో హ్యాట్రిక్ సాధించారు. 1999 ఎన్నికల్లో మళ్లీ ఆర్ఎస్‌డీపీ (టీడీపీ), కోరాడ శంకరరావు (కాంగ్రెస్) అభ్యర్థులుగా రంగంలో దిగారు. వీరితో బాటు స్వతంత్ర అభ్యర్థిగా కాకర్లపూడి వెంకట నరసింహరాజు, అన్నా టీడీపీ అభ్యర్థిగా దారబాల వీరభద్రరావు రంగంలో నిలిచారు. అప్పలనరసింహరాజుకు 60,624 ఓట్లు, శంకరరావు 35,796 ఓట్లు లభించాయి. కాకర్లపూడికి 6,632, వీరభద్రరావుకు 1608 ఓట్లు వచ్చాయి. దీంతో అప్పలనరసింహరాజు 24,828 ఓట్లు ఆధిక్యతతో నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు.



ఆర్ఎస్‌డీపీ అప్పలనరసింహరాజు

ఓటరు మాట



సేవా దృక్పథం అవసరం



సామాజిక సేవాభావం కలిగిన వారిని చట్టసభలకు ఎన్నుకోవాలి. నిజాయితీ, నిబద్ధత, నైతిక విలువలు కలిగిన వారు ప్రజా ప్రతినిధులైతే చిత్తశుద్ధితో సమస్యలు పరిష్కరించగలుగుతారు. గుర్తింపు కోసం ఆరాటపడే వారితో ఒరిగేది ఏమీ ఉండదు. అభ్యర్థుల వృత్తి, ప్రవృత్తులను గమనించి ఓటు వేయాలి. ఐదేళ్లకోసారి వచ్చే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. **- బల్లా నాగభూషణం,** విశ్రాంత జైల్ హెడ్ వార్డర్, అనకాపల్లి

మేలు చేసే నేతను ఎన్నుకుందాం



రాష్ట్రంలోని అన్ని వర్గాలకు మేలు చేకూర్చే దిశగా ఆలోచించే నేతలను ఎన్నుకోవాలి. సంకుచిత భావాలు కలిగిన వారైతే సమాజానికి చేటు. వ్యవసాయ రంగానికి ప్రోత్సాహకాలు అందించేందుకు చట్టసభలో ప్రస్తావించగలిగే నాయకుని గుర్తించాలి. పోటీలో ఉన్న అభ్యర్థుల్ని దీనిపై ప్రశ్నించాలి. అనుకూలమైన అభ్యర్థిని గెలిపించుకోవాలి. **- శరగడం నరసింగరావు,** విశ్రాంత ఉద్యోగి, చినముషిడివాడ

చట్టాలపై అవగాహన ఉండాలి



చట్టసభలకు పోటీ చేసే వారికి చట్టాలపై కనీస అవగాహన ఉండాలి. చేస్తున్న చట్టాలు ప్రజలకు ఎంతవరకు ఉపయోగపడతాయన్న విషయం తెలిసి ఉండాలి. లోపాలు ఎదురైతే సభలో ప్రస్తావించగలిగే వారిని ఎన్నుకోవడం వల్ల సమాజానికి మేలు జరుగుతుంది. పోటీలో ఉన్న అభ్యర్థుల్లో ఎవరు సమర్థులో గుర్తించి ఓటువేయాలి. **- రెడ్డిపల్లి ఆనందరావు,** ప్రైవేటు ఉద్యోగి, గాజువాక

పేటలో ఒకసారి ఓడితే.. అంతే!

మళ్లీ గెలవడం కష్టమే... ఓటర్ల వినూత్న తీర్పు



గంటెల సుమన



చెంగల వెంకట్రావు



కాకర నూకరాజు

పాయకరావుపేట, ఏప్రిల్ 20: అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గంలో పోటీ చేసినవారు ఒకసారి ఓడిపోతే ఇక అంతే సంగతులు. రెండోమారు మళ్లీ గెలిచిన సందర్భాలు లేవు. గంటెల సుమన, చెంగల వెంకట్రావు, కాకర నూకరాజు పాయకరావుపేట నుంచి పలుమార్లు పోటీ చేశారు. అయితే ముగ్గురూ ఒకసారి ఓడిపోయిన తరువాత ఎన్నిసార్లు పోటీ చేసినా తిరిగి గెలవలేదు. 1983 ఎన్నికల్లో టీడీపీ తరపున తొలిసారిగా గెలుపొందిన గంటెల సుమన ఆ తరువాత నాదెండ్ల భాస్కరరావుకు మద్దతు తెలిపి టీడీపీకి దూరమయ్యారు. అనంతరం 1985లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా కాకర నూకరాజు మొదటిసారి పోటీ చేసి గెలుపొందారు. ఆ తరువాత 1989, 1994 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన కాకర నూకరాజుకి ప్రత్యర్థిగా, అదేవిధంగా 1999లో టీడీపీ తరపున తొలిసారిగా పోటీ చేసిన చెంగల వెంకట్రావుకు ప్రత్యర్థిగా కాంగ్రెస్ తరపున గంటెల సుమన పోటీ చేసి...ఆ మూడు ఎన్నికల్లోనూ వరుసగా ఓటమి పాలయ్యారు. 1999 ఎన్నికల్లో అన్న తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసిన కాకర నూకరాజు మూడో స్థానంలో నిలిచారు. అదేవిధంగా 2004లో టీడీపీ తరపున చెంగల వెంకట్రావు రెండోసారి పోటీ చేయగా...కాంగ్రెస్ తరపున పోటీ చేసిన ఎ.విజయరావుతోపాటు ఇండిపెండెంట్‌గా పోటీలో నిలుచున్న గంటెల సుమన ఓటమిపాలయ్యారు. 2009లో టీడీపీ తరపున మూడో సారి బరిలోకి దిగిన చెంగల వెంకట్రావు కాంగ్రెస్ అభ్యర్థి గొల్ల బాబూరావు చేతిలో ఓటమి చెందారు. ఆ తరువాత 2012 ఉప ఎన్నికలో వైసీపీ తరపున పోటీ చేసిన గొల్ల బాబూరావు విజయం సాధించగా టీడీపీ టికెట్టుపై పోటీచేసిన చెంగల వెంకట్రావు, కాంగ్రెస్ తరపున పోటీ చేసిన గంటెల సుమన ఓటమిపాలయ్యారు. ఆ తరువాత 2014లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ తరపున పోటీచేసిన చెంగల వెంకట్రావు ఓటమి చెందారు. ఇక 2019లో బీజేపీ టికెట్‌పై పోటీ చేసిన కాకర నూకరాజు నోటా కంటే తక్కువ ఓట్లు సాధించి ఓడిపోయారు. ఇలా గంటెల సుమన ఒకసారి ఎన్నికల్లో ఓడిన తరువాత ఐదుసార్లు పోటీచేసినా గెలవలేకపోయారు. అదేవిధంగా చెంగల వెంకట్రావు, కాకర నూకరాజు ఒక సారి ఓటమిపాలైన తరువాత రెండు పర్యాయాలు పోటీ చేసినా గెలవలేదు.

మీకు తెలుసా...?

ఎన్నికల్లో ఎ, బీ ఫారం పేర్లు వింటాం. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల గుర్తులు పోటీలో ఉండే అభ్యర్థులకు కేటాయించాలంటే వీటి అవసరం ఉంది.

-ఉక్కుటౌన్‌షిప్

ఎ ఫారం అంటే...



గుర్తింపు పొందిన పార్టీ అధ్యక్షుడు ఓ అభ్యర్థిని ఎంపిక చేసి అతనికి ఎ ఫారం అందజేస్తారు. అతనికి మాత్రమే మిగిలిన అభ్యర్థులకు బీ ఫారం అందించే అర్హత ఉంటుంది. ఎ ఫారం అందుకున్న వ్యక్తి తనకు లభించిన ఫారంను ముందుగా ఎన్నికల అధికారికి అందజేస్తారు. అందులో తమ పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థుల వివరాలను పొందుపరుస్తారు. ఈ ఫారం మీద పార్టీ అధ్యక్షుడు లేదా ప్రధాన కార్యదర్శి సంతకం, పార్టీ ముద్ర ఉంటుంది.

బీ ఫారం అంటే...

గుర్తింపు పొందిన జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీలు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు వీరే అంటూ పార్టీ ప్రతినిధి (ఎ ఫారం కలిగి ఉన్న వ్యక్తి) ఇచ్చేది బీ ఫారం. ఎన్నికల నామినేషన్ సమయంలో ఎన్నికల అధికారికి బీ ఫారం అందజేస్తారు. బీ ఫారం ఉంటే ఆ అభ్యర్థిని రాజకీయ పార్టీ తమ అభ్యర్థిగా పోటీ చేయిస్తున్నట్టు. ఇది ఉంటేనే పార్టీకి సంబంధించిన గుర్తును ఆ అభ్యర్థికి కేటాయిస్తారు. ఎన్నికల్లో ఆ గుర్తుతోనే ప్రచారం చేస్తారు. బీ ఫారం ఇవ్వకపోతే ఎన్నికల సంఘం స్వతంత్ర అభ్యర్థిగా పరిగణిస్తుంది.

మీరూ పంపించండి

ఎన్నికల వేడి మొదలయ్యింది. పార్టీలు, అభ్యర్థులు సమరాంగణానికి సిద్ధమవుతున్నారు. ఎటువంటి వారు అధికారంలోకి రావాలని మీరు కోరుకుంటున్నారు? పాలకులు ఎలా ఉండాలనుకుం టున్నారు?, ఏం చేయాలని కోరుకుంటున్నారు? ...అభిప్రాయం ఏదైనా మీ మనసులో మాట మాతో పంచుకోండి. దాన్ని 'ఆంధ్రజ్యోతి' పాఠకుల ముందుంచుతాం. ఇంకెందుకు ఆలస్యం మీ అభిప్రాయాన్ని, ఫోటోతో సహా ఈ నంబరుకు వాట్సాప్ చేయండి.

వాట్సాప్ నంబర్ ... 9848212243

ఘనంగా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు



అనకాపల్లిలో చంద్రబాబు జన్మదిన కేకును కట్ చేస్తున్న దాడి రత్నాకర్



నక్కపల్లిలో చంద్రబాబు బర్త్ డే కేక్ కట్ చేస్తున్న వంగలపూడి అనిత



ఎలమంచిలిలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 20: స్థానిక లక్ష్మీనారాయణనగర్‌లోని డీవీఆర్ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ కేక్ కట్ చేసి చంద్రబాబు జన్మదిన వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా తుమ్మపాల పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. సుందరయ్యపేటలోని జీఎస్‌ఐ పాఠశాలలో అనాథ పిల్లలకు, పెద్దలకు భోజనాలు ఏర్పాటు చేశారు. నెహ్రూచౌక్‌లో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి పాదచారుల దాహం తీర్చారు. ఇదిలా ఉండగా అనారోగ్యంతో బాధపడుతున్న పట్టణంలోని ముత్రాసివీధికి చెందిన షైపాలి కనకలక్ష్మికి డీవీఆర్ ఫౌండేషన్ ద్వారా రూ.3,050 పింఛన్‌ను రత్నాకర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బొడ్డపాటి చినరాజారావు, కోటిపల్లి జేజిబాబు, వియ్యపు శ్రీనివాసయాదవ్, శిలపరశెట్టి బాబి, కోటిపల్లి శ్రీనివాసరావు, మళ్ల పద్మ, కోట్ని ఉమా తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో.. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు 74వ జన్మదిన వేడుకలు ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అనకాపల్లి మండలం సుందరయ్యపేట గ్రామంలో ఉన్న జీఎస్‌ఐ స్కూలులో అనాథాశ్రమ చిన్నారులకు భోజనాలు పెట్టారు. చిన్నారులతో రత్నాకర్ సరదాగా గడిపారు.

తుమ్మపాలలో.. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన వేడుకల్లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు కేకును కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం ఎన్టీఆర్ వైద్యాలయంలో గర్భిణులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. అలాగే టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆధ్వర్యంలో చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు జరిగాయి. ఆయన కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కుప్పిలి జగన్, కాండ్రేగుల సత్యనారాయణ, గుడాల సత్యనారాయణ, పూడి త్రినాథ్ పాల్గొన్నారు.

ఎలమంచిలిలో.. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు పుట్టిన రోజు వేడుకలను శనివారం ఎలమంచిలి టీడీపీ పార్టీ ప్రాంతీయ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తల సమక్షంలో మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు కేక్ కట్ చేసి పంచారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గొర్లె నానాజీ, బొద్దపు శ్రీను, ఆడారి ఆదిమూర్తి, బొద్దపు శ్రీను, మజ్జి రామకృష్ణ, రాజాన నారాయణమ్మ, కరణం రవి, నక్కా శివశంకర్, పిట్టా దాసుబాబు పాల్గొన్నారు.

నక్కపల్లిలో.. టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పుట్టిన రోజు వేడుకలను పాయకరావుపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత నివాసంలో ఘనంగా జరుపుకున్నారు. నాలుగు మండలాల నుంచి పార్టీ నాయకుల సమక్షంలో కేక్ కట్ చేసి చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు.

పాయకరావుపేటలో.. టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడి జన్మదిన వేడుకలు శనివారం పట్టణంలో ఘనంగా జరిగాయి. స్థానిక పార్టీ కార్యాలయంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, నాయకులు కంకిపాటి వెంకటేశ్వరరావు, బొంది కాశీవిశ్వనాథం, చింతకాయల రాంబాబు, దేవవరపు రాజబాబు, పల్లా విలియం కేరి, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెల రాజబాబు ఆధ్వర్యంలో చంద్రబాబునాయుడు బర్త్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు యాళ్ల వరహాలబాబు, మజ్జూరి నారాయణరావు, గూటూరు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ జిల్లా కార్యాలయంలో కేక్ చేసిన తర్వాత మాట్లాడుతున్న బుద్ధ

రాంబిల్లిలో.. మండలంలోని రాంబిల్లి, కృష్ణంపాలెం, పెదకలవలాపల్లి, అప్పన్నపాలెం తదితర గ్రామాల్లో శనివారం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కృష్ణంపాలెంలో కశిరెడ్డి ప్రసాద్, పెదకలవలాపల్లిలో కర్రి సింహగిరి ప్రసాద్, అప్పన్నపాలెంలో లాలం తాతబాబు కేక్‌ను కట్ చేసి అందరికీ పంచారు.

అచ్యుతాపురంలో.. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పుట్టిన రోజు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ ఎలమంచిలి ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు కేక్ చేసి అందరికి పంచారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ధూళి రంగనాయకులు, జనపరెడ్డి నరసింగరావు, గొర్లె నానాజీ, ఐతంశెట్టి రాజు, కొలుకూరి విజయబాబు, తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరంలో.. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు ఎం. మహాలక్ష్మీనాయుడు కేక్ కట్ చేసి నేతలు, కార్యకర్తలకు పంచారు. కార్యక్రమంలో నాయకులు రేసుపూడి రమణ, బరల రమణ, పల్ల తాతారావు, చైతన్య, పడాల శ్రీను, రొంగలి దేముడు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రదాతలను గెలిపించండి

▸▸ బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ సతీమణి శ్రీదేవి



ఉపాధి కూలీలకు మట్టి తట్ట ఎత్తుతున్న సీఎం రమేశ్ సతీమణి శ్రీదేవి

సబ్బవరం, ఏప్రిల్ 21 : కేంద్రం, రాష్ట్రంలో అభివృద్ధి ప్రదాతలైన నరేంద్రమోదీ, చంద్రబాబునాయుడులను రానున్న ఎన్నికల్లో గెలిపించాలని అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ సతీమణి శ్రీదేవి పిలుపునిచ్చారు. శనివారం బంగారమ్మపాలెంలో ఉపాధి కూలీల సమస్యలను తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో కమలం గుర్తుపై ఓటేసి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌ను, గాజుగ్లాసుపై ఓటేసి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్లను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ దాడి లావణ్య, ఎంపీటీసీ మాజీసభ్యుడు దొడ్డి ప్రకాశ్, బీజేపీ నేతలు శ్రీనివాసులనాయుడు, మాధవి, ఉషా, జ్యోతి పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణోత్సవం జరిపిస్తున్న దృశ్యం

నక్కపల్లి, ఏప్రిల్ 20: మండలంలోని ఉపమాక శివాలయంలో శుక్రవారం అర్ధరాత్రి శివపార్వతుల వార్షిక కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ ఆస్థాన మండపంలో ఉత్సవమూర్తులను అలంకరించి శైవాగమానుసారం అర్చకుల బృందం మహేశ్, సంతోశ్, పండుశర్మ, భగవాన్ శర్మ కల్యాణోత్సాన్ని జరిపించారు. గురుభవానీ పీఠం తరపున ఉచితంగా భక్తులకు రుద్రాక్షలు పంపిణీ చేశారు. శనివారం ఉదయం కుంకుమపూజ నక్కపల్లికి చెందిన శింగంశెట్టి బాపన్నశెట్టి కుటుంబీకుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో సీతారాముల వార్షిక కల్యాణం



ఎదురు సన్నాహం కార్యక్రమంలో పాల్గొన్న జడ్జిల దంపతులు

ఎలమంచిలి, ఏప్రిల్ 20: స్థానిక కొత్తపేట సీతారాముల ఆలయంలో శుక్రవారం రాత్రి సంప్రదాయ రీతిలో వార్షిక కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రిన్సిపల్ సివిల్ జడ్జి పి.స్వాతి భవాని దంపతులు, అడిషనల్ సివిల్ జడ్జి టి. వీరరాఘవేంద్రరరావు దంపతులతో ఎదురు సన్నాహం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వార్షిక కల్యాణాన్ని జరిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక న్యాయవాదులు, భక్తులు, దేవదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాలికకు ఆర్థిక సాయం

సబ్బవరం, ఏప్రిల్ 21: మండలంలోని ఇరువాడ శివారు గణపతినగర్‌లో క్యాన్సర్‌తో బాధపడుతున్న మామిడి సంజీవరావు, లక్ష్మి కుమార్తె హేమంతకుమారికి జోడుగుళ్లకు చెందిన సింగంపల్లి వెంకటరావు శనివారం రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. హేమంతకుమారి తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నందున చిరు సాయం అందజేసినట్టు వెంకటరావు తెలిపారు. వారికి బాలిక తల్లిదండ్రులు సంజీవరావు, లక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

సబ్బవరం, ఏప్రిల్ 21 : జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా స్వయం సహాక సంఘాల సభ్యులకు అగ్ని ప్రమాదాల నివారణపై ఫైర్ ఆఫీసర్ జీవీ సత్యరాజు అవగాహన కల్పించారు. అగ్నిమాపక పరికరాలు వాటి వినియోగం, ఉపయోగాలపై వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది కె. రాజారావు, కె. ఎల్లాజీ, ఎం. శ్యామ్‌కుమార్, ద్వారకాద్రి పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో గురుకులాల హాల్‌టికెట్లు

అచ్యుతాపురం, ఏప్రిల్ 20: ఈనెల 25న నిర్వహించనున్న ఏపీ గురుకుల పాఠశాలల్లో 5 నుంచి 8 తరగతులు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశ పరీక్ష హాల్ టికెట్లు వెబ్‌సైట్లో అందుబాటులో ఉన్నాయని స్థానిక గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.ప్రమీల కుమారి ఒక ప్రకటణలో తెలిపారు. విద్యార్థులు వెబ్‌సైట్ల ద్వారా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షలు హాజరవాలని కోరారు.

'ఎన్‌డీఏ కూటమి సభ్యులతో కలిసి పనిచేయాలి'

అచ్యుతాపురం, ఏప్రిల్ 20: ఎన్నికల్లో టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి బీజేపీ నేతలు, కార్యకర్తలు పనిచేయాలని బీజేపీ ఎలమంచిలి నియోజకవర్గ ఎన్నికల విభాగం ఇన్‌చార్జి ఎస్వీఎస్. ప్రకాష్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో శక్తి కేంద్ర ప్రముఖులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బూత్ లెవెల్లో బీజేపీ శ్రేణులు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. ఈ సమావేశంలో ఎలమంచిలి కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు, గొంతిన భక్త సాయిరాం, అగ్గాల హనుమంతరావు, ఇబ్రహీం భాషా, మేరుగు కాసుబాబు పాల్గొన్నారు.

టీడీపీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడిగా లాలం

రాంబిల్లి,ఏప్రిల్ 20: తెలుగుదేశం పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ బీసీసెల్ అధ్యక్షుడుగా లాలంకోడూరు గ్రామానికి చెందిన లాలం రమేష్‌నాయుడు నియమితులయ్యారు. ఈమేరకు శనివారం అచ్యుతాపురంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు నియామక పత్రాన్ని రమేష్‌నాయుడుకు అందజేశారు. తనకు ఈ పదవి వచ్చేందుకు కృషిచేసిన నేతలకు రమేష్‌నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధూళి రంగనాయకులు, విజయబాబు, నరసింగరావు, నానాజీ పాల్గొన్నారు.

ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేస్తా

▸▸ పాయకరావుపేట టీడీపీ అభ్యర్థి అనిత



పెనుగొల్లులో ప్రచారం చేస్తున్న వంగలపూడి అనిత

ఎస్.రాయవరం, ఏప్రిల్ 20: కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని పాయకరావుపేట టీడీపీ అభ్యర్థి వంగలపూడి అనిత తెలిపారు. మండలంలోని పెనుగొల్లులో శనివారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి అనిత ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు ఉమ్మడి ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేగా తనకు సైకిల్ గుర్తుపైన, బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు యేజెర్ల వినోద్‌రాజు, అమలకంటి అబద్దం, అల్లు నరసింహమూర్తి, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

20 కుటుంబాలు టీడీపీలో చేరిక

పాయకరావుపేట : నక్కపల్లిలోని అనిత తన స్వగృహంలో శనివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మండలంలోని పాల్తేరు పంచాయతీ అంకంపేటకి చెందిన 20 కుటుంబాలు చేరాయి. వీరందరికి టీడీపీ అభ్యర్థి వంగలపూడి అనిత కండువాలు కప్పి పార్టీలోని సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, నాయకులు బొంది కాశీవిశ్వనాథం, దేవవరపు రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి 50 కుటుంబాలు చేరిక

నక్కపల్లి:మండలం గుల్లిపాడు శివారు జానకయ్యపేట గ్రామానికి చెందిన 50 కుటుంబాల వారు శనివారం టీడీపీలోకి చేరారు. తన నివాసంలో వారందరికీ అనిత కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నియోజకవర్గం టీడీపీ నేతలు పలువురు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలని టీడీపీ ప్రచారం



పెదకలవలాపల్లిలో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేస్తున్న దిన్‌బాబు

రాంబిల్లి, ఏప్రిల్ 20 : సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని మండలంలోని పెదకలవలాపల్లిలో శనివారం టీడీపీ మండల అధ్యక్షుడు వి.దిన్‌బాబు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను తెలియజేశారు. ఈ సందర్భంగా దిన్‌బాబు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ప్రజలుపై పన్నుల భారాలు మోపి తేరుకోలేని విధంగా దెబ్బతీశారన్నారు. వచ్చేది కూటమి ప్రభుత్వమని, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అవుతారన్నారు. ఎలమంచిలి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్‌కు గాజుగ్లాసు గుర్తుపైన, అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని దిన్‌బాబు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ కర్రిసింహగిరి ప్రసాద్, నేతలు తాతాజీ, రాము, కోటేష్, గోపి, కొత్తకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పథకాలను ఎవరూ ఆపలేరు : శ్రీవేణి

అచ్యుతాపురం, ఏప్రిల్ 20: అర్హత ఉన్న వారికి ఏ సంక్షేమ పథకాలు ఆపలేరని ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన రూరల్ కార్యదర్శి మోటూరు శ్రీవేణి అన్నారు. శనివారం ఆమె ఇక్కడ విలేకర్లతో మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే కన్నబాబు రాజు నామినేషన్ కార్యక్రమానికి రానివారికి రాజీనామాలు చేసిన వలంటీర్లు బెదిరిస్తున్నారని ఆరోపించారు. సంక్షేమ పథకాలు ఆపేస్తామని, ఉపాధి హామీ పనులకు కూడా రానివ్వమని అంటున్నారన్నారు. అర్హత ఉన్న వారికి సంక్షేమ పథకాలు ఆపలేరన్నారు. ఎవరూ భయపడకుండా వచ్చే ఎన్నికల్లో బీజేపీ, జనసేన, టీడీపీ కార్యకర్తలు, నాయకులు ధైర్యంగా పనిచేసి కూటమి అభ్యర్థిని గెలిపించాలని ఆమె కోరారు.

ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులు

▸▸ సాయంత్రం ఐదున్నర నుంచి పది గంటల వరకు నిలిచిన ట్రాఫిక్

▸▸ గంటల తరబడి చిక్కుకున్న వాహనాలు

▸▸ ఇళ్లకు ఆరేడు గంటలు ఆలస్యంగా వెళ్లిన కర్మాగారాల కార్మికులు, ఉద్యోగులు



అచ్యుతాపురంలో నిలిచిన వాహనాలు

అచ్యుతాపురం, ఏప్రిల్ 20 : జగన్ రెడ్డి రోడ్‌షో కారణంగా అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) ఫ్యాక్టరీల ప్రతినిధులు, ఉద్యోగులు, కార్మికులు శనివారం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం ఐదు గంటలకు జనరల్ విధులకు వచ్చిన ఉద్యోగులు సాయంత్రం ఐదున్నర గంటలకు విధులు ముగించుకొని వెళ్లిపోతారు. శనివారం కూడా ఇదే విధంగా వాహనాల్లో వచ్చిన వారు ట్రాఫిక్ జామ్ వల్ల రాత్రి పది గంటల వరకు అచ్యుతాపురంలోనే ఉండిపోయారు. జనరల్ షిఫ్ట్ వాహనాలు వెళితేనే గాని నైట్ షిఫ్ట్ ఉద్యోగులు రావడానికి అవకాశం లేదు. జనరల్ షిఫ్ట్ వాహనాలు సకాలంలో గమ్యస్థానానికి చేరుకోపోవడంతో సెజ్ కర్మాగారాల్లో నైట్‌షిఫ్ట్ సిబ్బంది రావడంలో తీవ్ర జాప్యం జరిగింది. దీంతో అందుబాటులో ఉన్నవారితో నైట్ షిఫ్ట్ కొనసాగించడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. శనివారం జనరల్ షిఫ్ట్‌లో ఉన్న మహిళా ఉద్యోగులు, కార్మికులు సకాలంలో ఇంటికి చేరకపోవడంతో ఇళ్ల వద్ద కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. జగన్ రోడ్ షో కారణంగా అచ్యుతాపురంలో ట్రాఫిక్ జామ్ అయి సకాలంలో రాలేకపోయామని, రాత్రి ఏదో సమయానికి వస్తామని మహిళా ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులకు ఫోన్లో తెలియజేయాల్సి వచ్చింది.

జాతీయ రహదారిపై సాగిన సీఎం బస్సు యాత్ర

ఎలమంచిలి, ఏప్రిల్ 20: ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సిద్ధం బస్సు యాత్ర శనివారం ఎలమంచిలి జాతీయ రహదారిపై సాగింది. మండలంలోని పులపర్తి సమీపంలో నర్సీపట్నం మండలం పెద బొడ్డేపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడు పి. దీపక్ రావడంతో బస్సు ఆపి జగన్ అతని సమస్య తెలుసుకున్నారు. పులపర్తి జంక్షన్ వద్ద వేచి ఉన్న ప్రజలకు అభివాదం చేసుకుంటూ యాత్ర సాగించారు. అనంతరం పురుషోత్తపురం, రేగుపాలెం మీదుగా బస్సు యాత్ర సాగింది. మునిసిపాలిటీ పెదపల్లి జంక్షన్, కొక్కిరాపల్లి జంక్షన్‌ల వద్ద ఆశించిన స్థాయిలో జనం లేకపోవడం విశేషం. అనంతరం బస్సు యాత్ర కశింకోట మండలంలోకి ప్రవేశించింది.

నక్కపల్లిలో.. బస్సు యాత్రలో భాగంగా రెండో రోజైన శనివారం సీఎం జగన్ నక్కపల్లిలో రోడ్డు షో నిర్వహించారు. శుక్రవారం రాత్రి 9-30 గంటలకు గొడిచెర్లలో ముఖ్యమంత్రి బస చేశారు. శనివారం ఉదయం 10-30 గంటలకు గొడిచెర్ల నుంచి జగన్ బస్సుయాత్ర ప్రారంభమైంది. ఈ సందర్భంగా నక్కపల్లి హైవేపై సీఎం జగన్ బస్సుపైకి ఎక్కి కార్యకర్తలకు అభివాదం చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయండి

▸▸ బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ పిలుపు



కశింకోట కూటమి కార్యకర్తలతో సీఎం రమేశ్

కొత్తూరు, ఏప్రిల్ 20 : ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ పిలుపునిచ్చారు. శనివారం బీజేపీ కార్యాలయంలో కశింకోట మండల బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. కేంద్రంలో ఎన్‌డీఏ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతో అద్భుతమైన అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పాల్గొన్నారు.

'పేట'లో టీడీపీ ప్రచారం

పాయకరావుపేట, ఏప్రిల్ 20 : సార్వత్రిక ఎన్నికల్లో అనకాపల్లి బీజేపీ ఎంపీ సీఎం రమేశ్, పాయకరావుపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనితలను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను కోరారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో జనసేన పట్టణ అధ్యక్షుడు ఆచంట దొర, బీజేపీ నాయకుడు కువల కుమార్ బృందావనంలో ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చింతకాయల రాంబాబు, పల్లా విలియంకేరి, ఎం.రమాకుమారి, జనసేన నాయకులు బీఎస్.నారాయణ, శివలంక నాగమల్లి పాల్గొన్నారు.

సీఎం రమేశ్ గెలుపుతో అనకాపల్లి అభివృద్ధి

... 5వ పేజీ తరువాయి

చాలా సంవత్సరాల తరువాత మాట్లాడుతున్నానని, ఇద్దరు మిత్రుల కలయికతో మాట్లాడాల్సి వస్తున్నదన్నారు. ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు తమ్ముడు పవన్ కల్యాణ్, చంద్రబాబు, కేంద్రంలో మోదీతో కలిసి ఒక కూటమిగా ఏర్పడడం చాలా సంతోషంగా ఉందన్నారు. కూటమి ఏర్పడడం మంచి పరిణామమన్నారు. అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా సీఎం రమేశ్, పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థిగా పంచకర్ల రమేశ్‌బాబు పోటీ చేయడం ఆ ప్రాంత అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు.

24న సీఎం రమేశ్ నామినేషన్

కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ రాక

అనకాపల్లి: బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ ఈ నెల 24న నామినేషన్ దాఖలు చేయనున్న నేపథ్యంలో ఈ కార్యక్రమానికి కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరుకానున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో సీఎం రమేశ్ అనకాపల్లిలో భారీ ర్యాలీ నిర్వహించి ఆ రోజు ఉదయం 11.30 గంటలకు కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టికి నామినేషన్ పత్రాలు అందజేయనున్నారు.

బాలబాలికలకు ఉచిత కంటి పరీక్షలు

అనకాపల్లి రూరల్, ఏప్రిల్ 20 : మండలంలోని తారకరామకాలనీ జడ్పీ హైస్కూల్‌లో శనివారం పెదవాల్తేరు విశాఖ ఐ హాస్పటల్ వైద్యులు నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరంలో 260 మంది బాలబాలికలకు పరీక్షలు నిర్వహించారు. కంటి చూపులో లోపాలున్న వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సాయికృష్ణ, వైద్యులు ప్రత్యూష, సరోజిని, ఉపాధ్యాయులు బాపునాయుడు, ఎస్వీ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

బస్సుల కోసం పడిగాపులు

... 5వ పేజీ తరువాయి

తరబడి బస్సుల కోసం వేచి ఉండాల్సి వచ్చింది.

చోడవరంలో.. రోజూ చోడవరం మీదుగా 69 బస్సులు తిరుగుతుండగా, శనివారం కేవలం 12 బస్సులు మాత్రమే తిరగడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మిగతావన్నీ సీఎం సభకు తరలిపోవడంతో ప్రయాణికులు బస్టాండ్‌లో పడిగాపులు కాశారు. చోడవరం పరిధిలో చోడవరం నుంచి విశాఖ నగరానికి రోజూ 37 సర్వీసులు, చోడవరం నుంచి అనకాపల్లికి 10, చోడవరం నుంచి నర్సీపట్నానికి 11 సర్వీసులు, విశాఖ వయా చోడవరం మీదుగా పాడేరుకు 11 సర్వీసులు తిరుగుతుంటాయి. ఇవి కాక పాడేరు డిపో నుంచి చోడవరం వరకూ షటిల్ సర్వీసులు ఉంటాయి. అయితే సీఎం సభకు అనకాపల్లి, విశాఖపట్నం డిపోల నుంచి అధిక బస్సులు తరలివెళ్లిపోవడంతో, పట్టణానికి ఆర్టీసీ సర్వీసుల్లో భారీగా కోత పడింది. దీంతో అటు ఏజెన్సీ నుంచి ఇటు నర్సీపట్నం, అనకాపల్లి వెళ్లే ప్రయాణికులు సైతం నానా అవస్థలు పడ్డారు. చాలామంది ఆటోలు, జీపులను ఆశ్రయించారు.

మాకవరపాలెంలో.. ఆర్టీసీ బస్సులను సీఎం సభకు తరలించడంతో రోజూ నర్సీపట్నం నుంచి విశాఖపట్నం, అలాగే లంకెలపాలెం వెళ్లే ప్రైవేటు ఉద్యోగులు ఇబ్బంది పడ్డారు. మాకవరపాలెం నుంచి నర్సీపట్నం వెళ్లే పలు విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు అవస్థలు పడ్డారు. కొందరు ఆటోల్లో ప్రయాణాలు సాగించగా, మరికొందరు ఇంటి దారి పట్టారు.

కృష్ణాదేవిపేటలో.. గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట ఆర్టీసీ బస్ స్టేషన్‌లో బస్సులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సీఎం సభకు బస్సులను తరలిస్తే ఆర్టీసీ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిందని, ఇలా ఇబ్బందులకు గురి చేయడం తగదని పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఎలమంచిలిలో.. సీఎం సభకు బస్సులను తరలించడంతో ఎలమంచిలి బస్టాండ్‌లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గంటల తరబడి వేచి ఉన్నా బస్సులు రాకపోవడంతో ఆటోలు, జీపులను ఆశ్రయించి స్వగ్రామాలకు వెళ్లారు.

హామీలకే పరిమితం

... 5వ పేజీ తరువాయి

చేయించలేకపోయారు. దీంతో ప్రజలు విద్యుత్ సమస్యలు ఎదుర్కొంటూనే ఉన్నారు.

ఉత్తరాంధ్ర సుజల స్రవంతిలో ఏదీ పురోగతి

నియోజకవర్గంలో సాగునీటి వనరుల అభివృద్ధి కూడా కార్యరూపం దాల్చలేదు. ఇక నియోజకవర్గంలోని భూములకు సాగునీటి సౌకర్యం కోసం అమలు చేస్తామని చెప్పిన ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం కూడా ఆయన హయాంలో కనీసం పనులు చేపట్టించలేకపోయారు. నియోజకవర్గంలో ఉన్న గ్రోయిన్ల అభివృద్ధి అటుంచి కనీసం మరమ్మతులకు కూడా ఒక్క రూపాయి వెచ్చించకపోవడంతో రైతాంగం సాగునీటి సమస్యలు అలాగే ఉండిపోయాయి. కొమరవోలు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ హామీగానే మిగిలిపోయింది.

జిల్లా ఊసేది?

... 5వ పేజీ తరువాయి

అమలు చేస్తున్న నవరత్నాల పథకాల గురించి సుదీర్ఘ ప్రసంగం చేశారు. వైసీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరి, తాము ఎన్నికల్లో గెలిస్తే జిల్లా ప్రజలకు ప్రత్యేకంగా ఏం చేస్తారో చెప్పకుండానే సభను ముగించారు. జిల్లాలో నక్కపల్లి మండలం గొడిచర్ల విడిది కేంద్రం నుంచి మొదలైన బస్సుయాత్ర ఉద్దండపురం, కాగిత, సీతంపాలెం, నక్కపల్లి, అడ్డరోడ్డు, పి.ధర్మవరం జాతీయ రహదారి మీదుగా సాగింది. నక్కపల్లిలో రోడ్డు పక్కన కొంత మంది సీఎంకు అభివాదం చేయడంతో అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అనంతరం ఎలమంచిలి నియోజకవర్గం పులపర్తి, పురుషోత్తపురం, పోతిరెడ్డిపాలెం, రేగుపాలెం, కొక్కిరాపల్లి మీదుగా అనకాపల్లి నియోకవర్గాల పరిధిలోని చింతలపాలెం సభావేదిక నుంచి తాళ్లపాలెం, బయ్యవరం, కశింకోట, కొత్తూరు, రేబాక, శంకరం గ్రామాల మీదుగా పెందుర్తి నియోజకవర్గం చిన్నయ్యపాలెం వరకు సాగింది. దారి పొడవునా ఎక్కడా పెద్దగా జనం కనిపించక పోవడంతో జగన్ బస్సు దిగకుండానే అభివాదం చేస్తూ ముందుకు సాగారు.

జీలుగులోవలో రెండు పూరిళ్లు దగ్ధం

» కట్టుబట్టలతో మిగిలిన ఆదివాసీ కుటుంబాలు



ప్రమాదంలో సర్వం కోల్పోయిన ఆదివాసీలు

రావికమతం, ఏప్రిల్ 20 : మండలంలోని జీలుగులోవ ఆదివాసీ గ్రామంలో శనివారం రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. చీమలపాడు పంచాయతీ కల్యాణపులోవకు ఎగువ కొండ శిఖరంపై ఉన్న ఈ గ్రామంలో మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో సీదిరి రాజు, చిలకమ్మలకు చెందిన పూరిళ్లు కాలిబూడిదయ్యాయి. అడవిలో నుంచి మంటలు పెద్ద ఎత్తున వచ్చి ఇళ్లకు వ్యాపించి కాలిపోయాయని బాధితులు వాపోయారు.. వేసవి కావడంతో గాలులు వీచడం, మంటలను అదుపు చేసేందుకు నీళ్లు కూడా లేకపోవడంతో ఇళ్లలో ఉన్న ఐదు బస్తాల రాగులు, నాలుగు బస్తాల ధాన్యం, పది నాటు కోళ్లతో పాటు రూ.30 వేల నగదు, బట్టలు, వంటసామగ్రి కాలిపోయాయన్నారు. తామంతా కట్టుబట్టలతో మిగిలామని, ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాల్సిందిగా బాధిత కుటుంబాలవారు కోరుతున్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

నాతవరం, ఏప్రిల్ 20 : సుందరకోటంలో మూడు రోజుల క్రితం పూరిళ్లు కాలిపోయిన బాధిత కుటుంబానికి నాసా సంస్థ డైరెక్టర్ జ్యోతిప్రేమదాసు బాసటగా నిలిచారు. ఈ మేరకు శనివారం వంట సామగ్రి, నిత్యావసర సరకులు, వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దళిత ప్రగతి ఐక్య సంఘం నాయకులు చిట్టిమూరి కొండబాబు, బండి రవి, మాజీ సర్పంచ్ పట్టెం రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక పరికరాలపై అవగాహన అవసరం



పరికరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ అప్పలస్వామి

నర్సీపట్నం, ఏప్రిల్ 20 : అగ్నిమాపక పరికరాలు, వాటి వినియోగంపై విద్యార్థులకు అవగాహన అవసరమని నర్సీపట్నం అగ్నిమాపక శాఖాధికారి పి.అప్పలస్వామి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం అగ్నిమాపక కేంద్రంలో పరికరాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. అగ్ని ప్రమాదాలు, నివారణా చర్యలు, అగ్ని మాపక పరికరాలు, వాటి వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

సీఎం రమేశ్ గెలుపుతో అనకాపల్లి అభివృద్ధి

... 5వ పేజీ తరువాయి

చాలా సంవత్సరాల తరువాత మాట్లాడుతున్నానని, ఇద్దరు మిత్రుల కలయికతో మాట్లాడాల్సి వస్తున్నదన్నారు. ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు తమ్ముడు పవన్ కల్యాణ్, చంద్రబాబు, కేంద్రంలో మోదీతో కలిసి ఒక కూటమిగా ఏర్పడడం చాలా సంతోషంగా ఉందన్నారు. కూటమి ఏర్పడడం మంచి పరిణామమన్నారు. అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా సీఎం రమేశ్, పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థిగా పంచకర్ల రమేశ్‌బాబు పోటీ చేయడం ఆ ప్రాంత అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో నడవాలంటే ఇటువంటి నాయకులను గెలిపించాల్సిన అవసరం ఉందని చిరంజీవి తెలిపారు.

సీఎం రమేశ్ నామినేషన్ కార్యక్రమానికి రాజ్‌నాథ్‌సింగ్

అనకాపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ ఈ నెల 24న నామినేషన్ దాఖలు చేయనున్న నేపథ్యంలో ఈ కార్యక్రమానికి కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ హాజరుకానున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో సీఎం రమేశ్ అనకాపల్లిలో భారీ ర్యాలీ నిర్వహించి ఆ రోజు ఉదయం 11.30 గంటలకు కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టికి నామినేషన్ పత్రాలు అందజేయనున్నారు.

హామీలకే పరిమితం

... 5వ పేజీ తరువాయి

చేయించలేకపోయారు. దీంతో ప్రజలు విద్యుత్ సమస్యలు ఇప్పటికీ ఎదుర్కొంటూనే ఉన్నారు.

ఉత్తరాంధ్ర సుజల స్రవంతిలో ఏదీ పురోగతి

నియోజకవర్గంలో సాగునీటి వనరుల అభివృద్ధి కూడా కార్యరూపం దాల్చలేదు. ఇక నియోజకవర్గంలోని భూములకు సాగునీటి సౌకర్యం కోసం అమలు చేస్తామని చెప్పిన ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం కూడా ఆయన హయాంలో కనీసం పనులు చేపట్టించలేకపోయారు. నియోజకవర్గంలో ఉన్న గ్రోయిన్ల అభివృద్ధి అటుంచి కనీసం మరమ్మతులకు కూడా ఒక్క రూపాయి వెచ్చించకపోవడంతో రైతాంగం సాగునీటి సమస్యలు అలాగే ఉండిపోయాయి. కొమరవోలు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ హామీగానే మిగిలిపోయింది.

జిల్లా ఊసేది?

... 5వ పేజీ తరువాయి

అమలు చేస్తున్న నవరత్నాల పథకాల గురించి సుదీర్ఘ ప్రసంగం చేశారు. వైసీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరి, తాము ఎన్నికల్లో గెలిస్తే జిల్లా ప్రజలకు ప్రత్యేకంగా ఏం చేస్తారో చెప్పకుండానే సభను ముగించారు. జిల్లాలో నక్కపల్లి మండలం గొడిచర్ల విడిది కేంద్రం నుంచి మొదలైన బస్సుయాత్ర ఉద్దండపురం, కాగిత, సీతంపాలెం, నక్కపల్లి, అడ్డరోడ్డు, పి.ధర్మవరం జాతీయ రహదారి మీదుగా సాగింది. నక్కపల్లిలో రోడ్డు పక్కన కొంతమంది సీఎంకు అభివాదం చేయడంతో అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అనంతరం ఎలమంచిలి నియోజకవర్గం పులపర్తి, పురుషోత్తపురం, పోతిరెడ్డిపాలెం, రేగుపాలెం, కొక్కిరాపల్లి మీదుగా అనకాపల్లి నియోకవర్గాల పరిధిలోని చింతలపాలెం సభావేదిక నుంచి తాళ్లపాలెం, బయ్యవరం, కశింకోట, కొత్తూరు, రేబాక, శంకరం గ్రామాల మీదుగా పెందుర్తి నియోజకవర్గం చిన్నయ్యపాలెం వరకు సాగింది. దారి పొడవునా ఎక్కడా పెద్దగా జనం కనిపించకపోవడంతో జగన్ బస్సు దిగకుండానే అభివాదం చేస్తూ ముందుకు సాగారు.

ఇరవై రోజులు కష్టపడితే.. ఐదేళ్లు ప్రజలకు ఆనందం

» కూటమి అభ్యర్థుల విజయమే అందరి లక్ష్యం కావాలి

» టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల ఆత్మీయ కలయికలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల



మాడుగులలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు, చిత్రంలో మాజీ మంత్రి బండారు

మాడుగుల, ఏప్రిల్ 20 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల అభివృద్ధికి నాంది అని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు అన్నారు. మండల కేంద్రం మాడుగులలో శనివారం నిర్వహించిన కూటమి పార్టీల ఆత్మీయ కలయికలో మాట్లాడారు. కూటమి అనకాపల్లి పార్లమెంటు అభ్యర్థి సీఎం రమేశ్, మాడుగుల నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్న బండారు సత్యనారాయణమూర్తిల విజయమే అందరి లక్ష్యం కావాలన్నారు. ఈ ఇరవై రోజులు కష్టపడితే, రాష్ట్రప్రజలు ఐదేళ్లు ఆనందంగా ఉంటారని వివరించారు. అనంతరం మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ తనకు మాడుగుల నియోజకవర్గంతో సత్సంబంధాలు ఉన్నాయన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలంతా ఆశీర్వదించి గెలిపించాల్సిందిగా కోరారు. ఎన్డీఏ అధికారంలోకి వస్తే పాడేరు ఘాట్ వరకు నాలుగులైన్ల రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారు. వైసీపీ కక్షపూరిత రాజకీయాల కారణంగా జైలు గోడల అంచెలవరకు వెళ్లి ప్రజల అండతో తిరిగి వచ్చానన్నారు. అంతకు ముందు మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీకుమార్, ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ సోదరుడు సురేశ్ నాయుడు మాట్లాడుతూ ప్రజలంతా కమలం గుర్తుపై సీఎం రమేశ్‌కు, సైకిల్ గుర్తుపై బండారుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిందిగా కోరారు. నాయకులు అద్దెపల్లి జగ్గారావు, ఉండూరు దేముడు, పుప్పాల అప్పలరాజు, పుట్టా గంగయ్య, వరలక్ష్మి, సంతోషి, సుబ్బలక్ష్మి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మాడుగులను పారిశ్రామికంగా అభివృద్ధి చేయడంతో పాటు రైవాడ జలాశయం నుంచి ఆరువేల ఎకరాల అదనపు ఆయకట్టుకు నీరందించి, వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తానని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మండలంలోని కాశీపురంలో శనివారం కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో మాడుగుల ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను, కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌ను గెలిపిస్తే ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేసే విధంగా కృషి చేస్తానన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్, సీఎం రమేశ్ సోదరుడు సురేశ్‌నాయుడు, పోతల పాత్రునాయుడు తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మాడుగుల నియోజకవర్గం అభివృద్ధికి కూటమి అభ్యర్థులను గెలిపించాల్సిందిగా బండారు సత్యనారాయణమూర్తి కోరారు. శనివారం రాత్రి ఇక్కడ ఏర్పాటైన టీడీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సోమవారం మాడుగులలో తాను నామినేషన్ దాఖలు చేయనున్నానని, అంతా తరలి రావాల్సిందిగా కోరారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, నాయకులు పీవీజీ కుమార్, డోకల నరసింహమూర్తి, పూడి నారాయణమూర్తి, జూరెడ్డి రాము తదితరులు పాల్గొన్నారు.

'కూటమి అభ్యర్థుల గెలుపు అందరి బాధ్యత'



గొంప గ్రామస్తులతో సమావేశమైన జనసేన నాయకుడు రాజు

రావికమతం, ఏప్రిల్ 20 : టీడీపీ, జనసేన, బీజేపీ అధిష్ఠానాలు ప్రకటించిన అనకాపల్లి పార్లమెంటు అభ్యర్థి సీఎం రమేశ్, చోడవరం అసెంబ్లీ అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజులను గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు అన్నారు. శనివా రం గొంప, గుడ్డప, తట్టబంద, చినపాచిల, కేబీపీ అగ్రహారం, కవ్వగుంట తదితర గ్రామాలలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. అన్నిరంగాల్లో వెనుకబడిన చోడవరం నియోజకవర్గం అభివృద్ధి చెందేందుకు కూటమి అభ్య ర్థులకు అంతా మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు గల్లా రాజేశ్వరావు, జనసేన మండల అధ్యక్షుడు షైచర్ల నాయుడు, గొంప ఎంపీటీసీ గంజి సూర్యనారాయణ, చింతల కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు సీఎం రమేష్ ఆశీర్వాదం



పల్లకీలో ఉన్న వధూవరులను పకలరిస్తున్న సీఎం రమేష్

చోడవరం, ఏప్రిల్ 20 : పల్లకీలో ఊరేగుతున్న నూతన వధూవరులను అనకాపల్లి పార్లమెంట్ కూటమి అభ్యర్థి సీఎం రమేష్ పలకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చోడవరం పట్టణంలో శుక్రవారం రాత్రి తిరుగుతున్న సీఎం రమేష్‌కు అదే సమయంలో పల్లకీలో ఊరేగుతున్న వధూవరులు కనిపించారు. వారిని ఆప్యాయంగా పలకించడంతో పాటు పేర్లు తెలుసుకున్నారు. అనంతరం శుభాకాంక్షలు తెలిపారు. ఈ దృశ్యాన్ని చూసిన బంధువులు సైతం ఆనందం వ్యక్తం చేశారు.

వ్యవసాయ సాగులో సూచనలు పాటిస్తే సత్ఫలితాలు



టైమ్ లైన్‌పై గ్రామస్తులకు వివరిస్తున్న విద్యార్థులు

రావికమతం, ఏప్రిల్ 20 : కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మత్స్యవానిపాలెంలో శనివారం నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు పంటల సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలో గల రామాల యం వద్ద టైమ్‌లైన్ గీసి, గ్రామంలో సౌకర్యాలు, వనరులు, అభివృద్ధి, వ్యవసాయ సాగు విధానంపై వివరించారు. పంటల సాగులో వ్యవసాయాధికారుల సూచనలను పాటించాలన్నారు. కేవీకే ప్రతినిధులు డాక్టర్ ఎస్.రాజ్‌కుమార్, డాక్టర్ ఎస్.కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పదకొండు అడుగుల కొండచిలువ హతం



గ్రామస్తుల చేతిలో హతమైన పాము

నాతవరం, ఏప్రిల్ 20 : మాధవనగరంలో శనివారం పదకొండు అడుగుల కొండచిలువ హతమైంది. పెద్దదేముడుబాబు చెరువులో ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలు ఉదయం ఆరు గంటలకు పనులు చేస్తున్నారు. ఇంతలో వారికి ఈ పాము కనిపించడంతో భయాందోళనకు గురయ్యారు. ఎంతకీ అక్కడి నుంచి కదలకపోవడంతో ఆత్మరక్షణ కోసం దానిని హతమార్చారు. దీంతో అక్కడివారంతా ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు.

చోడవరం టీడీపీ అభ్యర్థిగా

కేఎస్ఎన్ఎస్ రాజు నామినేషన్



చోడవరం, ఏప్రిల్ 20 : చోడవరం నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు శనివా రం నామినేషన్ దాఖలు చేశారు. ముహూర్తం మేరకు ఎలాంటి హడావుడి లేకుండా తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లునాయుడుతో కలిసి ఆయన రిటర్నింగ్ అధికారి చిన్నికృష్ణకు నామినేషన్ పత్రాన్ని సమర్పించారు. ఇదిలావుంటే, ఈ నెల 25వ తేదీన భారీ ఎత్తున రాజు మరోసారి నామినేషన్ దాఖలు చేసే కార్యక్రమానికి పార్టీ నాయకులు సన్నాహాలు చేస్తున్నారు.

మాడుగులలో మరో నామినేషన్ దాఖలు



ఆర్‌వోకు నామినేషన్ సమర్పిస్తున్న తాళ్ల రవి

మాడుగుల, ఏప్రిల్ 20 : ఎన్నికల్లో మాడుగుల అసెంబ్లీ స్థానానికి పోటీకి సంబంధించి శనివారం మరో నామినేషన్ దాఖలైంది. మాడుగుల పట్టణంలోని జగన్నవావిడికి చెందిన తాళ్ల రవి నవభారత నిర్మాణ సేవా పార్టీ (ఎన్‌బీఎన్ఎస్‌పీ) తరఫున నామినేషన్ వేశారు. సదరు పత్రాన్ని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిణికి సత్యవాణికి అందజేశారు.

బి.సింగవరంలో 'పైలా' ప్రచారం



గ్రామంలో ఓటర్లతో మాడుతున్న పైలా ప్రసాదరావు

చీడికాడ, ఏప్రిల్ 20 : మండలంలోని బి.సింగవరంలో శుక్రవారం రాత్రి పైలా ప్రసాదరావు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు సీఎం కాగానే అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. నాయకులు శరగడం శివ, రవి, దాడి కల్యాణం, ధర్మిశెట్టి వరహాలు నాయుడు, కామిరెడ్డి ఎరుకునాయుడు, దొగ్గ బలరాం తది తరులు పాల్గొన్నారు.

మాడుగుల మండలంలో చిరుజల్లులు

మాడుగుల/ మాడుగుల రూరల్, ఏప్రిల్ 20 : వాతావరణంలో మార్పుల కారణంగా మండలంలో శనివారం చిరుజల్లులు కురిశాయి. దీంతో అంతటా ఒక్కసారిగా చల్లబడింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత కొనసాగింది. పది గంటల సమయానికి ఇళ్లలోనివారు బయటకు రాలేకపోయారు. అయితే మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ఆకాశంలో మేఘాలు కమ్ముకుని చిరుజల్లులు కురిశాయి. ఫలితంగా అంతవరకు ఉష్ణతాపంతో అల్లాడిపోతున్న జనం కాస్త ఉపశమనం పొందారు.

ప్రశాంత వాతావరణంలో

మరిడి మహాలక్ష్మి పండగ

ప్రజలంతా సహకరించాలి

సాంస్కృతిక కార్యక్రమాల వేళలు మార్పు : అయ్యన్న




అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, ఏప్రిల్ 20 : పట్టణంలో మరిడి మహాలక్ష్మి పండగ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అంతా సహకరించాల్సిందిగా మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు కోరారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సాంస్కృతిక కార్యక్రమాలు రాత్రి ఏడు గంటల నుంచి పది గంటల వరకు మాత్రమే నిర్వహించాలని పెద్దలందరం నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. శనివారం ఆయన పట్టణవాసులను ఉద్దేశించి ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. సోమ వారం రాత్రి పెద్ద జారణ సందర్భంగా ప్రొగ్రామ్స్‌కి రాత్రి పది గంటల తర్వాత పోలీసులు అనుమతించడం లేదన్నారు. పూర్వం నుంచి అర్ధరాత్రి వరకు సాంస్కృతిక కార్యక్రమాలు పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తుందని వివరించారు. అయితే సోమవారం రాత్రి ఏడు గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు మొదలు పెట్టి, పది గంటలతో ముగిస్తామన్నారు. ఆ తర్వాత అమ్మవారి పెద్ద జాగరణ మొదలవుతుందని, 23న అమ్మవారి పండగ ఉంటుందని తెలిపారు. ప్రజలంతాసహకరించాల్సిందిగా కోరారు.

గొడవలు సృష్టించేందుకు కుట్ర : విజయ్

గొడవలు సృష్టించి ఏదోక విధంగా మరిడి మహాలక్ష్మి పండగ ఆపడానికి వైసీపీ నాయకులు కుట్ర చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాలయ విజయ్ ఆరోపించారు. శనివారం ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ మరిడితల్లి అమ్మవారి హుండీ రెండేళ్లకు రూ.2.5 లక్షల ఆదాయం వచ్చిందని, నిబంధనల ప్రకారం గుడి ఆదాయం ఐదు లక్షలు దాటితేనే ఎండోమెంటులో కలపాలని వివరించారు.

అయ్యన్నను కలిసిన అనకాపల్లి టీడీపీ నేతలు



అయ్యన్నను సన్మానించిన అనకాపల్లి టీడీపీ నాయకులు

నర్సీపట్నం, ఏప్రిల్ 20 : నర్సీపట్నం శాసన సభ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడ్ని అనకాపల్లి టీడీపీ నేతలు శనివారం కలిశారు. పట్టణంలోని అయ్యన్న నివాసంలో కలిసి చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా కేక్ కటింగ్ చేశారు. అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, మళ్ల సురేంద్ర తదితరులు అయ్యన్నను దుశ్శాలువ, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాయల మురళి, రాజాన అప్పారావు, మల్లేటి వాసు, తమ్మిన విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలో చేరిన యర్రాపాత్రుడు

మాకవరపాలెం, ఏప్రిల్ 20 : మండలంలోని బూరుగుపాలెం ఎంపీటీసీ రుత్తల యర్రాపాత్రుడు సీఎం జగన్ సమక్షంలో శనివారం వైసీపీలో చేరారు. పాయకరావుపేట నియోకవర్గంలో పర్యటిస్తున్న జగన్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. యర్రాపాత్రుడు 2019లో టీడీపీలో చేరి అయ్యన్నపాత్రుడుతో కలిసి పనిచేశారు. ఇప్పుడు మళ్లీ వైసీపీ గూటికి ఆయనతో పాటు పాపయ్యపాలెం సర్పంచ్ వి.లక్ష్మి చేరారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి గణేష్, సన్యాసిపాత్రుడు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణోత్సవం జరిపిస్తున్న దృశ్యం

నక్కపల్లి, ఏప్రిల్ 20: మండలంలోని ఉపమాక శివాలయంలో శుక్రవారం అర్ధరాత్రి శివపార్వతుల వార్షిక కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ ఆస్థాన మండపంలో ఉత్సవమూర్తులను అలంకరించి శైవాగమానుసారం అర్చకుల బృందం మహేశ్, సంతోశ్, పండుశర్మ, భగవాన్ శర్మ కల్యాణోత్సాన్ని జరిపించారు. గురుభవానీ పీఠం తరఫున ఉచితంగా భక్తులకు రుద్రాక్షలు పంపిణీ చేశారు. శనివారం ఉదయం కుంకుమపూజ నక్కపల్లికి చెందిన శింగంశెట్టి బాపన్నశెట్టి కుటుంబీకుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

'చంద్రబాబు, మోదీ ద్వయంతోనే అభివృద్ధి'

రావికమతం, ఏప్రిల్ 20 : రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు, దేశంలో ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ ఉన్నప్పుడే గ్రామాల అభివృద్ధితో పాటు సంక్షేమ ఫలాలు ప్రజలందరికీ అందుతాయని బీజేపీ మండల అధ్యక్షుడు చిన్న అన్నారు. కొట్నాబిల్లి, గదబపాలెం, రామన్నదొరపాలెం గ్రామాల్లో పార్టీ శ్రేణులతో ప్రచారం నిర్వహించారు.

బస్సుల కోసం పడిగాపులు



చోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు



గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట బస్ స్టేషన్‌లో...



మాకవరపాలెం బస్ స్టేషన్‌లో...

... 5వ పేజీ తరువాయి

తరబడి బస్సుల కోసం వేచి ఉండాల్సి వచ్చింది.

చోడవరంలో..

చోడవరం: రోజూ చోడవరం మీదుగా 69 బస్సులు తిరుగుతుండగా, శనివారం కేవలం 12 బస్సులు మాత్రమే తిరగడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మిగతావన్నీ సీఎం సభకు తరలిపోవడంతో ప్రయాణికులు బస్టాండ్‌లో పడిగాపులు కాశారు. చోడవరం పరిధిలో చోడవరం నుంచి విశాఖ నగరానికి రోజూ 37 సర్వీసులు, చోడవరం నుంచి అనకాపల్లికి 10, చోడవరం నుంచి నర్సీపట్నానికి 11 సర్వీసులు, విశాఖ వయా చోడవరం మీదుగా పాడేరుకు 11 సర్వీసులు తిరుగుతుంటాయి. ఇవి కాక పాడేరు డిపో నుంచి చోడవరం వరకూ షటిల్ సర్వీసులు ఉంటాయి. అయితే సీఎం సభకు అనకాపల్లి, విశాఖపట్నం డిపోల నుంచి అధిక బస్సులు తరలివెళ్లిపోవడంతో, పట్టణానికి ఆర్టీసీ సర్వీసుల్లో భారీగా కోత పడింది. దీంతో అటు ఏజెన్సీ నుంచి ఇటు నర్సీపట్నం, అనకాపల్లి వెళ్లే ప్రయాణికులు సైతం నానా అవస్థలు పడ్డారు. చాలామంది ఆటోలు, జీపులను ఆశ్రయించారు.

కృష్ణాదేవిపేటలో..

కృష్ణాదేవిపేట: గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట ఆర్టీసీ బస్ స్టేషన్‌లో బస్సులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సీఎం సభకు బస్సులను తరలిస్తే ఆర్టీసీ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిందని, ఇలా ఇబ్బందులకు గురి చేయడం తగదని పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు.

మాకవరపాలెంలో..

మాకవరపాలెం: ఆర్టీసీ బస్సులను సీఎం సభకు తరలించడంతో రోజూ నర్సీపట్నం నుంచి విశాఖపట్నం, అలాగే లంకెలపాలెం వెళ్లే ప్రైవేటు ఉద్యోగులు ఇబ్బంది పడ్డారు. మాకవరపాలెం నుంచి నర్సీపట్నం వెళ్లే పలు విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు అవస్థలు పడ్డారు. కొందరు ఆటోల్లో ప్రయాణాలు సాగించగా, మరికొందరు ఇంటి దారి పట్టారు.

ఎలమంచిలిలో..

ఎలమంచిలి: సీఎం సభకు బస్సులను తరలించడంతో ఎలమంచిలి బస్టాండ్‌లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గంటల తరబడి వేచి ఉన్నా బస్సులు రాకపోవడంతో ఆటోలు, జీపులను ఆశ్రయించి స్వగ్రామాలకు వెళ్లారు.